RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



24 జనవరి 2025 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:200

## విప్రో విస్తరణ ప్రణాళికను స్వాగతించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### 5000 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.



దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , పరిశ్రమలు-ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , ఉన్నతాధికారులు ప్రఖ్యాత విప్రో సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల విస్తరణకు విప్రో సంస్థ అంగీకారం తెలిపింది.

విప్రో కంపెనీ హైదరాబాద్ లో తమ క్యాంపస్ విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని గోపనపల్లి లో కొత్తగా మరో ఐటీ సెంటర్ నెలకొల్పనుంది. దీంతో అదనంగా 5000 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.

హైదరాబాద్‌లో ఐటీ రంగం వృద్ధిలో విప్రో కీలక భాగస్వామి. విప్రో క్యాంపస్ విస్తరణతో రాష్ట్రంలో సాంకేతిక రంగం మరింత వృద్ధి చెందనుంది. ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయి.

కొత్త ఐటీ సెంటర్ రాబోయే రెండు మూడేండ్లలో పూర్తవుతుంది. ప్రభుత్వంతో విప్రో చేసుకున్న ఒప్పందంతో ప్రపంచ ఐటీ పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ ఖ్యాతి మరింత బలోపేతమవుతుంది.

విప్రో విస్తరణ ప్రణాళికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. విప్రో లాంటి పేరొందిన సంస్థలకు తగిన మద్దతు ఇచ్చేందుకు, వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు.

కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, అవకాశాలు సృష్టించడానికి తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం తమకు ఉత్సాహంగా ఉందని ఈ సందర్భంగా విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ అన్నారు.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం పంచుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు విప్రో కంపెనీని ఆహ్వానించారు.

## జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో 13 అంశాలకు కమిటీ ఆమోదం



వార్తా 7 లో

## మీర్‌పేట కేసులో - నిందితుడు గురుమూర్తికి మరో మహిళతో సంబంధం ఉందని అనుమానం...



హైదరాబాద్, జనవరి 23(భారత్ సమాచార్)హైదరాబాద్ మీర్‌పేట మహిళ హత్య కేసులో కొత్త కోణం వెలుగుచూసింది. నిందితుడు గురుమూర్తి మొబైల్‌లో మరో మహిళ ఫోటోలను పోలీసులు గుర్తించారు. ఆమెతో ఉన్న అక్రమ సంబంధం వల్లే మాధవిని వదిలించుకునేందుకు హత్య చేసి ఉంటాడని భావిస్తున్నారు. మటన్ కత్తితో మృతదేహాన్ని ముక్కలు చేసిన గురుమూర్తి బకెట్లో పెట్టి వాటర్ హీటర్‌తో ఉడికించినట్లు తెలుస్తోంది. అనంతరం అందులోనే దంచి చెరువులో పడేసినట్లు పోలీసులకు నిందితుడు వెల్లడించారు. తర్వాత మాధవి కనిపించట్లేదంటూ ఆమె తల్లిదండ్రులకు చెప్పినట్లు తెలుస్తోంది.భార్య కనిపించడం లేదని ఫిర్యాదు : ఆర్మీలో పనిచేసి రిటైరైన గురుమూర్తి జిల్లెలగూడలో నివాసముంటూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతని ఫోన్?లో ఉన్న మహిళ ఫోటోల గురించి మాధవి ప్రశ్నించింది. ఈ విషయంపై ఈనెల 15న భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో గురుమూర్తి దాడి చేసినట్లు పోలీసులు అంచనావేశారు. దాడిలో భార్య చనిపోవడంతో ముక్కలు చేసి మాయం చేసిన గురుమూర్తి, మాధవి కనిపించడం లేదని ఈనెల 17 ఆమె తల్లిదండ్రులకు సమాచారమిచ్చాడు. వారితో కలిసి మీర్‌పేటలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పట్టించిన సీసీ కెమెరాలు : నిందితుడి ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన పోలీసులు మాధవి బయటకు వెళ్లినట్లు కనిపించకపోవడంతో గురుమూర్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో మరో మహిళతో ఉన్న ఫోటోలను పోలీసులు గుర్తించారు. మరో మహిళతో సంబంధం నేపథ్యంలో భార్యను కడతేర్చేందుకు పథకం పన్ని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఐతే నిందితుడు విచారణకు పూర్తి స్థాయిలో సహకరించట్లేదని సమాచారం.మెదక్ జిల్లా తూప్రాన్ మండలం దండుపల్లికి చెందిన వెంకటమాధవికి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా జేపీచెరువుకు చెందిన గురుమూర్తితో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గురుమూర్తి గతంలో సైన్యంలో పనిచేసి పదవీ విరమణ చేశాడు. ప్రస్తుతం డీఆర్డీవోలో కాంట్రాక్టు విధానంలో భద్రతా సిబ్బందిగా పని చేస్తున్నాడు.ఈ కేసులో మరిన్ని ఆధారాల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతదేహం పారేసిన జిల్లెల చెరువులో ఆనవాళ్ల కోసం వెతుకున్నారు. కేవలం నిందితుడు చెప్పిన సమాచారంతో మాత్రమే కాకుండా సాంకేతిక ఆధారాలను కూడా సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు.

## బాల్ ఠాక్రే ,నేతాజీ సుభాష్ చంద్రబోస్ లకు భారతరత్న ప్రకటించాలి

### శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రాథనా కార్యదర్శి సుదర్శన్ డిమాండ్

కాచిగూడ దగ్గర ఈ రోజు హిందూ సామ్రాట్ శ్రీ బాల్ ఠాక్రే 99 వ జయంతి మరియు భారత్ దేశ ముద్దుబిడ్డ నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128 వ జయంతి పురస్కరిన్చికొని గురువారం శివసేన తెలంగాణ పార్టీ ఆద్వర్యం లో ఇరువురికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రాథనా కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ ఒకరేమో దేశం కోసం ధర్మం కోసం మరొకరు దేశం దేశ రక్షణ కోసం ఎవరి శ్వాస వరకు భారతదేశానికి సేవలందించిన మహానుభావులు హిందూ సామ్రాట్ శ్రీ బాల్ ఠాక్రే, నేతాజీ సుభాష్ చంద్రబోస్ లని కొనియాడారు. బాల సాహెబ్ ఠాక్రే , నేతాజీ సుభాష్ చంద్రబోస్ ల జయంతి సందర్భంగా హిందు బందువులందరికీ మరియు భారతీయులందరికీ పేరుపేరునా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వెంకటేష్ బతిరాజ్ గౌట్ గణేష్ తెలంగాణ అధికార ప్రతినిధిపూస శ్రీనివాస్ అవినాష్ సుదర్శన్ కిరణ్ నందు భారత్ తదితరులు పాల్గొన్నారు



గురువారంనాడు 23 జనవరి 2025న, ఉదయం, జగద్గురు సామ్రాట్ భగవాన్ శ్రీ కల్కి మహారాజ్ జీతో పాటు డాక్టర్ భగవంతరావు మరియు కల్కి భక్తులు ప్రయాగ్‌రాజ్ తీర్థ సంగమం వద్ద సంపూర్ణ మహా కుంభస్నానం చేసారు, శ్రీ కల్కి జింక యొక్క దండ కూడా సంగంలో స్నానం చేసి పూజించారు.

## ప్రజల గొంతుక ప్రజాబలం దినపత్రిక హుజురాబాద్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ జి



హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 23 హుజురాబాద్ ఏసిపి కార్యాలయంలో ప్రజాబలం వార్షిక క్యాలెండర్ ను గురువారం రోజున ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ జి చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసిపి శ్రీనివాస్ జి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చేరవేస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ముందున్న పత్రిక ప్రజాబలం అని కొనిఆడారు. రానున్న కాలంలో కూడా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజల మన్ననలు ప్రభుత్వ అధికారుల మన్ననలు పొందాలన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా బలం హుజురాబాద్ ఆర్ సి ఇంచార్జ్ రచ్చ రవికృష్ణ టి డబ్ల్యూ జేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు సౌడమల్ల యోహన్, సహాయ కార్యదర్శి ఎండి ఖాజాఖాన్, ఎండి రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

24 జనవరి 2025 శుక్రవారం

# హక్కులకు దూరంగా అనాథలు

పుట్టుకతో ఎవరూ 'అనాథ' కాదు. పరిస్థితులు తలకిందులై అనాథగా మనుగడ సాగించాల్సిన ఆవశ్యత ఏర్పడుతోంది. కళ్లుతెరవకుండానే పసికందులు మురుగుకాల్వల్లో ప్రత్యక్షమవుతున్నారు. చనుబాలు రుచి చూడకుండానే రక్తపు ముద్దగా ముళ్లపొదలో కనిపిస్తున్నారు. కారణాలు ఏవైతేనేం.. పొత్తిళ్లలో ఉండాల్సిన పసికందులు ఎందరో అనాథలుగా మారుతున్నారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, తెలిసీతెలియని వయసులో వేసిన తప్పటడుగులు, అనైతిక బంధాలు ప్రతిబంధకాలుగా మారటంతో కన్నబిడ్డలను వదిలించు కుంటుండడంతో అనాథలుగా జీవనం గడుపుతున్నారు. 'అమ్మా' అని పరితపించే పిల్లలు బాలకార్మికులు, భిక్షకులుగా, నేరాల రొంపిలోకి దిగి దుర్భరమైన జీవితాలను వెళ్ళదీస్తున్నారు. ఇంకొంతమంది అనాథాశ్రమాలలో తలదాచుకుంటున్నారు. సాధారణంగా వీరి వయసు ఐదు నుంచి పద్దెనిమిదేళ్ల మధ్య ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఇరవై కోట్లకుపైగా అనాథలుంటారని అంచనా. మన దేశంలో దశాబ్దం క్రితమే సుమారు రెండున్నర కోట్ల మంది అనాథలున్నట్లు అధికార గణాంకాలు చెప్పాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతినిత్యం ఆరేడు వేల మంది పిల్లలు వీథుల పాలవుతున్నారు. వీరందరి హక్కులను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత. వీరి సంక్షేమం నీటి మీది రాతలా మారింది. కనీస గుర్తింపులేకుండా జీవిస్తున్న అనాథలకు రాజ్యాంగంలో హక్కులు కల్పించాలని, వారి కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం చేయాలని చాలా ఏళ్లుగా డిమాండ్ ఉంది. తల్లిదండ్రులెవరో, కులమేదో, మతమేదో, ప్రాంతమేదో తెలియక, నా అన్నవారు లేకుండా అభాగ్యులుగా బతుకుతున్న వీరిపట్ల మానవత్వంతో వ్యవహరించడం ప్రతి పౌరుడి విధి. అనాథల ఉద్ధరణ కోసం కొన్ని ప్రజాహిత బృందాలు, స్వచ్ఛంద సంస్థలు పని చేస్తున్నాయి. అయితే వారి సంక్షేమం కోసం వ్యవస్థీకృత మార్పుల దిశగా చట్టసభలలో మాట్లాడే గొంతుక లేకపోవడం బాధాకరం. కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలోగానీ, కెజి టూ పిజి వరకు ఉచిత విద్య, గురుకులాల్లో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. 'పిఎం కేర్ ఫర్ చిల్డ్రన్' పథకం కింది ఆదుకుంటామని కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ, ఆచరణకు నోచుకోలేదు. చిన్నారుల పేరుమీద ఫిక్సడ్ డిపాజిట్ తెరవడం, పదేళ్లలోపు చిన్నారుల విద్యకోసం, ఉన్నత విద్య అవసరాల కోసం స్టయిఫండ్ అందివ్వడం, ఆయుష్మాన్ భారత్ లేదా ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకాన్ని వర్తంపజేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. అనాథలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారి హక్కుల సాధన కోసం అందరినీ ఒక వేదిక మీదకు తీసుకువచ్చే ప్రయత్నం నాలుగేళ్ల క్రితం గాదె ఇన్నయ్య నేతృత్వంలోని 'ఫోర్స్ ఫర్ అర్బన్ రైట్స్ కమ్యూనిటీ ఎంపవర్‌మెంట్ (ఫోర్స్)' అంతర్జాతీయ సదస్సును నిర్వహించింది. ఎనిమిది దేశాల ప్రతినిధిలు, దేశంలోని 18 రాష్ట్రాల ఎన్‌జిఓ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనాథలకు ప్రాథమిక హక్కులు కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అయినప్పటికీ ఆ దిశలో ప్రభుత్వాలు ముందుకు సాగలేదు. అనాథ పిల్లల సంక్షేమం కోసం 'ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ (ఐసీపీఎస్)'ను ఏర్పాటు చేసినప్పటికీ బడ్జెట్ కేటాయింపులు అరకొరగా ఉండి, వారి అవసరాలను తీర్చడం లేదు. అనాథ బాలలకు పునరావాసం కల్పించడం కోసం రూపొందించిన విధానాలను కాగితాలకు పరిమితం చేయకూడదని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీం కోర్టు రెండేళ్ళ క్రితం ఆదేశించినప్పటికీ నిరాశే ఎదురవుతోంది. అనాథ పిల్లల ఆలనాపాలనా చూసేందుకు వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఆశ్రమాలు, బాలసదనాలు మనుగడలో ఉన్నాయి. లక్షల సంఖ్యలో ఉన్న మన దేశంలో వీటి పనితీరు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. కొన్ని అనాథాశ్రమాల్లో పిల్లలతో బిచ్చం ఎత్తించడం, వ్యభిచార కేంద్రాలకు తరలించడం, కనీస వసతులు కల్పించలేక మురికికూపాలుగా మారాయి. ట్రాఫిక్ కూడళ్లు, పర్యాటక ప్రాంతాలు, ప్రార్థన మందిరాల సమీపంలో బిక్షమెత్తుకుంటూ 10 12 ఏళ్ల వయస్సున్న చిన్నారులు కాసులు కురిపించే వస్తువులుగా మారుతున్నారు. వీరిని గుర్తించి సంరక్షించాల్సిన మహిళా శిశుసంక్షేమ విభాగం చూసీ చూడనట్లు వదిలేస్తోంది. అప్పుడప్పుడు స్వచ్ఛంద సంస్థలు చేపట్టే కార్యక్రమాల్లో బాలకార్మికులను గుర్తించి సంరక్షణ కేంద్రాలకు తరలిస్తున్నారు. అనాథ బాలికలకు గుణాత్మక విద్యను అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటైన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. దేశవ్యాప్తంగా అరవై వేల మంది చిన్నారులు సంరక్షణ కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. వీరిలో అత్యధికంగా పది వేల మందికి తమిళనాడులోని కేంద్రాలు ఆశ్రయం కల్పిస్తున్నాయి. మిషన్ వాత్సల్య పథకం కింద సంస్థాగత కేర్ హెూమ్‌సులో ఉంటున్న పిల్లల సంఖ్య డిసెంబరు నాటికి తగ్గినప్పటికీ దేశవ్యాప్తంగా చైల్డ్‌కేర్ సంస్థల నెట్‌వర్క్ మరింత విస్తరించింది. తమిళనాడు వరుసగా మూడవ ఏడాది కూడా అత్యధిక సంఖ్యలో అనాథ పిల్లలకు కేర్ హెూమ్‌సులో ఆశ్రయం కల్పించింది. దక్షిణాది రాష్ట్రాల్లో 202122లో 13,877 మంది పిల్లలు కేర్ హెూమ్‌సులో తలదాచుకోగా, 202223లో ఆ సంఖ్య 7,785కు తగ్గింది. గత ఏడాది తెలంగాణ కేర్ హెూమ్‌సులో 2,243 మంది అనాథలు తలదాచుకుంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన అనాథశ్రమాలు 182 వరకు ఉన్నాయి. అనధికారికంగా సుమారు 500 వరకు ఉన్నట్లు అంచనా. ఇవన్నీ కూడా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వమే నిర్వహించాలి. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తే కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. అయితే చాలావరకు అనాథశ్రమాలు అక్రమ మార్గాల్లో పయనిస్తున్నాయి. పిల్లలను ఎరవేసి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. నిధులను సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. మన రాష్ట్రంలోని బాలసదనాలు (చిల్డ్రన్స్ హెూం)కు పక్కాభవనాలు లేకపోవడంతో సమస్యలతో కూనరిల్లుతున్నాయి. తాత్కాలిక భవనాలు, స్వచ్ఛంద సంస్థల నీడలో కాలం వెల్లదీయాల్సి వస్తోంది. సకాలంలో నిధులు విడుదల కాకపోవడం, భూకేటాయింపులు లేకపోవడంతో బాలసదనాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 35 బాలసదనాలు మంజూరు చేసింది. ఇందులో 33 బాలికలు, రెండు బాలురకు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో సగానికిపైగా బాలసదనాలకు ఇప్పటికీ పునాదులు పడలేదు. మరికొన్ని నిధుల కొరతతో మధ్యలో ఆగిపోయాయి. రాష్ట్రంలో నాలుగు మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి.

# భార్యను చంపి... కుక్కర్ లో ఉడికించి... పొడి చేసి...
## అనుమానమే... పెనుభూతమై

**హైదరాబాద్, జనవరి 23(ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణలో దారుణం చోటుచేసుకుంది. భార్యను చంపి మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేసి కుక్కర్ లో ఉడికించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ లో ఈ దారుణం జరిగింది. ఈ నెల 18న తన భార్య వెంకట మాధవి కనిపించడం లేదని భర్త గురుమూర్తి...భార్య తల్లిదండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో పోలీసులకు షాకింగ్ విషయాలు తెలిశాయి. భార్యాభర్తలు గురుమూర్తి, వెంకట మాధవి మధ్య గత కొన్ని రోజులుగా మనస్పర్థలు ఉన్నాయని, తరచూ గొడవపడుతుండేవారని పోలీసులకు తెలిపింది. భార్యను చంపిన గురుమూర్తి.. ఆ తర్వాత తనకేం తెలియనట్టు వ్యవహరించాడు. ఎవరికీ అనుమానం రాకుండా అమాయక చక్రవర్తిలా నటించాడు. అయితే రోజులు గడిచినా మాధవి నుంచి ఎలాంటి ఫోన్‌కాల్ రాకపోవడంతో కన్నవాళ్లకు అనుమానం వచ్చింది. తమ బిడ్డ కనిపించడం లేదంటూ ఈనెల 13న మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారుదీంతో భర్త గురుమూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో గురుమూర్తి అసలు విషయం చెప్పాడు.తన భార్యను తానే హత్య చేశానని గురుమూర్తి ఒప్పుకున్నాడు. భార్య మృతదేహాన్ని ముక్క ముక్కలుగా చేసి కుక్కర్ ఉడికించానని చెప్పాడు. అనంతరం ఆ ముక్కలను జిల్లెలగూడ చెరువులో పడేసినట్టు చెప్పాడు. గురుమూర్తి చెప్పిన విషయాలపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహం ఆనవాళ్ల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. గురుమూర్తి గతంలో ఆర్మీలో పనిచేసి రిటైరైనట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం కంచన్‌బాగ్‌లో సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. తూప్రాన్‌పేట్‌లోని దండుపల్లిలో గురుమూర్తి కుటుంబంతో నివశిస్తు?న్నాడు. వెంకట మాధవి మిస్సింగ్ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.ప్రకాశం జిల్లా జేపీ చెరువుకు చెందిన గురుమూర్తి వృత్తి రీత్యా డీఆర్డీవో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తూ.. జిల్లెల్లగూడలోని న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీలో భార్య వెంకట మాధవి(35)తో కలిసి జీవిస్తున్నాడు. వీరి సంసారంలో అనుమానం తలెత్తింది. దీంతో గురుమూర్తి తన భార్య వెంకట మాధవిని అనుమానించేవాడు. ఈ విషయమై ఇరువురి మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ చెలరేగింది. దీంతో ఆగ్రహానికి లోనైనా గురుమూర్తి భార్యను అత్యంత దారుణంగా హత్య చేశాడు. అనంతరం భార్య మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోశాడు. కమర్షియల్ సిలిండర్ తెచ్చి ముక్కలను ఉడకబెట్టాడు. అనంతరం కొన్ని ముక్కలను ఎండబెట్టి పొడిగా మార్చాడు. భార్యను చంపడానికి ముందు ట్రయల్ కోసం ఓ కుక్కను చంపి ముక్కలుగా నరికి ఉడకబెట్టాడు. ఇదే విషయాన్ని విచారణలో అంగీకరించాడన్నారు పోలీసులు.గురుమూర్తి శాడిజం కన్నబిడ్డలతో పాటు బంధువుల్ని నివ్వెరపోయేలా చేసింది. కేవలం అనుమానంతోనే భార్యను కడతేర్చాడా? ఇంకేవైనా కారణాలు ఉన్నాయా? మర్డర్ ఎపిసోడ్‌లో గురుమూర్తికి ఎవరైనా సహకరించారా అన్న కోణంలో పోలీసులు ఆరాతీస్తున్నారుమృతదేహం పొడిని బకెట్‌లో తీసుకువెళ్లి జిల్లెలగూడ చెరువులో కలిపేశాడు.వెంకట మాధవి మృతదేహానికి సంబంధించి ఆనవాళ్ల కోసం పోలీసులు చెరువులో గాలిస్తున్నారు. బుడిద కావడంతో ఎలాంటి ఆనవాళ్లు దొరకడంలేదని తెలుస్తోంది. ఈ ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది

# అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు
## మున్సిపల్ కమిషనర్ నీలిగొండ వెంకటేశ్వర్లు




ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 23:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన 19వ వార్డు వార్డు సభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ రేషన్ కార్డులు లేనివారికి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు అవుతాయన్నారు. అర్హుల జాబితా చదివి వినిపిస్తున్నారని, అలాగే ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ఇల్లు లేకుండా కట్టుకోవడానికి స్థలం ఉన్నవారికి మరియు ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కట్టుకోవడానికి స్థలం లేని వారికి కూడా ఇండ్లు వస్తాయన్నారు. రైతు భరోసా కింద దరఖాస్తు చేసుకున్న వారికి తనిఖీ చేసి వారికి కూడా రైతు భరోసా వస్తుందన్నారు. ఇందులో ఎవరైనా అనర్హులు ఉంటే తెలియజేసినచో అభ్యంతరాలు వ్రాతపూర్వకముగా ఇచ్చినచో వారిని జాబితా నుండి తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు ఆఫీసర్ రాజేశ్వరరావు, ఇన్చార్జి టిఎంసి ఏ. రఘురాం, డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి. శ్యాంబాబు, ఆర్పీలు టి. అరుణ, బి. జ్యోతి 19వ వార్డు ప్రజా ప్రతినిధులు అయినటువంటి సుక్కు సుదర్శన్, మంకు రమేష్, ఆకారం రమేష్, మాయ తిరుపతి, ఏటూరు సత్యనారాయణ, బండారి సత్యనారాయణ, కత్తి రమేష్, వీరేందర్, బొంగుని కేశవులు, జంగాపల్లి రాజేశం,

# షేక్ సాబీర్ అలీ ఒక బ్లాక్ మెయిలర్.

హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 23పైసలు ఇచ్చినా కేసు నమోదు ఎలా చేసావని ఓ వ్యక్తి ఫోన్ లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గ%శీ% జమ్మికుంట సిఐ తో వాగ్వాదానికి దిగిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది.

సిఐ పై వస్తున్న ఆడియో గురించి వివరణ కోరగా

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో నివాసముంటున్న షేక్ సాబీర్ అలీ అనే వ్యక్తి అధికారులను,ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఆడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నాడని చెప్పారు. ఒక బ్లాక్ మెయిలర్ గా కొనసాగుతున్నాడని అన్నారు. సామాజిక కార్యకర్తనంటూ, హెచ్ఆర్సీలో పనిచేస్తున్నానంటూ ప్రచారం చేసుకుంటూ తిరుగుతున్నాడు. ప్రజలను, ప్రజలతో సంబంధాలున్న నాయకులను, అధికారుల ను, సిబ్బందిని, తదితరులను బెదిరింపులకు గురిచేస్తూన్నాడు. పంచాయతీలు చేస్తూ జీవితం గడుపుతున్నారు. గతంలో అతనిపై పలు కేసులు నమోదయ్యాయి. అతనిపై ఇప్పటివరకు ఒక్క జమ్మికుంట పోలీస్ స్టేషన్లోనే నమోదైన కేసులు ఇలా ఉన్నాయన్నారు.

2023 లో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గా కే సమ్మయ్య పనిచేస్తున్న సమయంలో అతడిని పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేశాడు. అంతేకాకుండా రూ. 15000 ఇవ్వాలని బ్లాక్మెయిల్ చేశాడు. దీన్ని భరించలేని కమిషనర్ సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.2023 లో పట్టణంలోని సురక్ష హాస్పిటల్ లో ఒక వ్యక్తి మృతి చెందగా,ఆసుపత్రికి వెళ్లి గొడవ చేసాడు. హాస్పిటల్ నిర్వాహకుడు, డాక్టర్ తిరుపతి ని ఒక లక్ష డిమాండ్ చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు

కేసు నమోదు చేశారు. 2020 లో జమ్మికుంట స్టేషన్లో పనిచేస్తున్న మేకల ఐలయ్య ను దూషించడం,విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసీ బైండ్ ఓవర్ చేసినట్లు తెలిపారు.ఈనెల 22 గురువారం సిఐని ఏకవచనంతో సంబోధిస్తూ ఇష్టానుసారంగా మాట్లాడి, ఎస్ ఆర్ కే డైరీ కృష్ణారావు కేసు విషయంలో మూడు లక్షలు బాత్రూంలో పెట్టాను అంటూ వాయిస్ రికార్డులను వాట్సాప్ లో పోస్టులు చేశాడు. ఒక పోలీసు అధికారిని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారు.గతంలో మండలంలో నాగంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి క్లినికల్ ట్రైలర్స్ లో మృతి చెందగా,ఆ విషయంలో ఇతను బాధితులను రెచ్చగొట్టడం చేశాడు. అంతేకాకుండా పలువురిపై బ్లాక్ మెయిల్ కు పాల్పడ్డాడనీ ఆరోపణ లు ఉన్నాయన్నారు.సామాజిక కార్యకర్త, హెచ్ఆర్సి ముసుగులో షేక్ సాబీర్ ఆలీ చేస్తున్న బెదిరింపులు, ఆగడాలపై బాధితులు బయటకు రావాలి. ఫిర్యాదులు చేసేందుకు ముందుకు రావాలి. ప్రజలకు అధికారులకు ఇబ్బందులు కలిగించేసే వ్యక్తిని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు.

# నల్గొండ కాంగ్రెస్ లో కొత్త వర్సెస్ పాత...

**నల్గొండప్రజాబలం ప్రతినిధి: జనవరి 23,** నల్గొండ కాంగ్రెస్‌లో కొత్త, పాతల పంచాయితీ నడుస్తోంది. ముఖ్యంగా నకిరేకల్ నియోజకవర్గంలో భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల విషయంలో..ఎమ్మెల్యే వేముల వీరేశం వర్సెస్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నట్లుగా మారాయట పాలిటిక్స్. నకిరేకల్ సెగ్మెంట్‌లోని మార్కెట్ కమిటీల నియామకంలో తమ వర్గానికి, సీనియర్ నేతలకు అన్యాయం జరిగిందని భావిస్తోందట కోమటిరెడ్డి టీమ్.వేముల వీరేశంతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతలకు నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టారని..ఆ నేతలకు కాంగ్రెస్ పార్టీకి సంబంధం ఏంటంటూ లోకల్ లీడర్లు గళమెత్తున్నారట. దీంతో ఎమ్మెల్యే వేముల వీరేశం వర్సెస్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నట్లుగా మారిపోయిందట సీన్.మొన్నటి వరకు అంతా బానే కనిపించినా..నకిరేకల్ నియోజకవర్గంలో అసలు కథ ఇప్పుడే షురూ అయిందన్న టాక్ వినిపిస్తోంది. నియోజకవర్గంలో అధికార పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయిందని..పాత, కొత్త కాంగ్రెస్ పార్టీ అంటూ క్యాడర్ కూడా రెండు వర్గాలుగా విడిపోయారనే చర్చ జరుగుతోంది. ఇక నామినేటెడ్ పోస్ట్‌ల ఇష్యూ మరింత చిచ్చురేపిందట. నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని నార్కట్‌పల్లి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సొంత మండలం.ఒకప్పుడు నల్గొండ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న చిట్యాల, నార్కట్‌పల్లి మండలాలు 2009 నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నకిరేకల్ సెగ్మెంట్‌లో కలిశాయి. దీంతో నకిరేకల్ నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి బలమైన క్యాడర్, అనుచరవర్గం ఉంది. అందుకే ఎన్నికలకు ముందు వేముల వీరేశం కాంగ్రెస్‌లో చేరేందుకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సుముఖత కోసం చాలా రోజులు ఆగాల్సి వచ్చిందంటుంటారు. అయితే అధికారంలోకి వస్తే తమ హవానే నడుస్తుందని భావించిన కోమటిరెడ్డి వర్గం..అడుగడుగునా ఇబ్బందులే ఎదురవుతున్నాయని ఫీలవుతుందట.

కోమటిరెడ్డి వర్గం అసంతృప్తికి ఇటీవల నియమించిన చిట్యాల, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీల కొత్త కార్యవర్గమేనట. చిట్యాల, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యుల్లో మొదటి నుంచి పార్టీ జెండా మోసినోళ్ల పేరు ఒక్కటి లేదట. బయట నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టారట. చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన నర్రా మోహన్ రెడ్డిది టీడీపీ, బీఆర్ఎస్ బ్యాక్ గ్రౌండ్. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి కాంగ్రెస్‌లోకి వచ్చారు.అక్కడ ఇదే పోస్ట్‌పై సీనియర్ నేత పోకల దేవదాసుతో పాటు చాలా మంది సీనియర్లు గంపెడాశలు పెట్టుకున్నారట. అటు కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రధాన అనుచరుడు చిన్న వెంకట్ రెడ్డి కూడా తన వర్గానికే మార్కెట్ చైర్మన్ పదవి ఇప్పించుకునేందుకు లాబీయింగ్ చేసినా..భంగపాటే ఎదురైందట. ఇక నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్‌లోనూ సేమ్ సీన్. అక్కడ కూడా కొత్త మార్కెట్ ఛైర్మన్‌గా గుత్తా మంజులా రెడ్డిని నియమించారు. ఈమె కూడా ఎన్నికల ముందు వేముల వీరేశంతో కలిసి బీఆర్ఎస్ నుంచి వచ్చారు.ఒక నామినేటెడ్ పోస్ట్‌ల విషయంలోనే కాదు..మంత్రి కోమటిరెడ్డి అనుచరుడు అంటే చాలు..సదరు నేతను దూరం పెడుతున్నారట ఎమ్మెల్యే వేముల వీరేశం. తనతో పాటు పార్టీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని గుస్సా అవుతున్నారు సీనియర్ కాంగ్రెస్ లీడర్లు. కనీసం అధికారిక కార్యక్రమాలకు కూడా సమాచారం ఇవ్వడం లేదట.అసలు పార్టీలో ప్రాధాన్యత, గౌరవం లేదని..పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఇంత అవమానం ఎదుర్కోలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఎన్నోసార్లు చెప్పుకుంటూ బాధ పడ్డారట క్యాడర్, లీడర్లు. వేముల వీరేశం చేరికను వ్యతిరేకిస్తే విన్నారా..వద్దూ వద్దూ అంటే కావాలని తెచ్చి పెట్టుకున్నారు..ఇప్పుడు చేయడానికేమీ లేదని తన అనుచరులపై గరం గరం అవుతున్నారట మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. దాంతో మింగలేక కక్కలేక..అలా అని పార్టీని వీడలేక అయోమయంలో పడిపోయారట కోమటిరెడ్డి వర్గం నేతలు.ఇక నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొనే కార్యక్రమాలకు ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులు ఎవరూ హాజరుకావడం లేదట. కోమటిరెడ్డిని కలవడానికి కానీ..కార్యక్రమాలకు కానీ ఎవ్వరూ వెళ్లొద్దని మౌఖిక ఆదేశాలు వెళ్లాయట. ఈ మాట ఎవరూ ఇచ్చారంటే..అందరి వేళ్ళు ఎమ్మెల్యే వేముల వీరేశం వైపే చూపిస్తున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇటీవల నకిరేకల్ నియోజకవర్గ పరిధిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తనయుడు కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాలకు స్వయంగా మంత్రి హాజరైనా..ఎమ్మెల్యే వీరేశం కానీ.. ఆయన అనుచరులు కానీ అందులో పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఎమ్మెల్యే వీరేశం మాత్రం తమ మధ్య ఎలాంటి గ్యాప్ లేదని..అంతా బానే ఉందని చెప్పుకొస్తున్నారు. నకిరేకల్ కాంగ్రెస్‌లో కొత్త, పాతల పంచాయితీ ఎక్కడ వరకు దారితీస్తుందో వేచి చూడాలి మరి.

# జాతీయ గీతంగా జనగణమన

భారత జాతీయ గీతంగా జనగణమన 1911లోరవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన, మొదటిసారి పాడిన గీతాన్ని 1950 జనవరి 24న రాజ్యాంగ సభ స్వీకరించిన రోజు. జనగణమన భారత జాతీయగీతం. నోబెల్ బహుమతి గ్రహీత, రవీంద్రనాథ్ టాగోర్ రాసిన బెంగాలీ గీతం లోని మొదటి భాగం ఇది. భారత జాతీయగీతం సంస్కృత పద భూయిష్టమైన బెంగాలీ భాషలో ఉంది. 1911 డిసెంబర్ 27 న కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మొదటి సారిగా పాడారు.1912 జనవరి లో ఈ గీతాన్ని "తత్వ భోదిని" అనే పత్రిక "భారత విధాత" అనే పేరుతో ప్రచురించింది. 1950 జనవరి 24 న జాతీయగీతంగా రాజ్యాంగ సభ స్వీకరించింది. ఈ గీతానికి సంగీత బాణీ కూడా ముందుగా ఠాగూర్ సృష్టించారు. బాణీ కనుగుణంగా ఈ గీతాలాపన చేసేందుకు 52 సెకండ్లు పడుతుంది. అప్పుడప్పుడు మొదటి, చివరి పాదాలను మాత్రమే పాడే పద్ధతి కూడా ఉంది. దీనికి 20 సెకండ్లు పడుతుంది. భారతదేశ జాతీయగీతం 'జనగణమన' గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిజానికి 1911లోనే రాశారు. అదే ఏడాది డిసెంబర్ 27న కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో కూడా దానిని ఆలపించారు. ఆ తర్వాత కూడా జాతీయోద్యమం నేపథ్యంలో ఆ గీతాన్ని అనేక సార్లు, అనేక వేదికల మీద ఆలపించారు. అయితే ఇప్పుడు మనం వినే ట్యూన్‌లో కాకుండా, నిర్దిష్టమైన స్వర కల్పన లేకుండా, ఎవరికి నచ్చిన రాగంలో వాళ్లు పాడుకునేవారు. జనగణమనకు ఆ స్వరాన్ని కట్టింది ఒక ఐరిష్ జాతీయురాలైతే... దానికి వేదికైంది చిత్తూరు జిల్లా మదనపల్లె అనే విషయం చాలా మందికి తెలియని తెలియదు. భారత స్వాతంత్రోద్యమాన్ని బలపరిచిన డాక్టర్ అనీబిసెంట్ మదనపల్లెలో థియోసాఫికల్ కాలేజీని స్థాపించారు. ఐరిష్ జాతీయుడైన ప్రముఖ విద్యావేత్త జేమ్స్ హెన్రీ కజిన్స్ దాని ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. లండన్ మ్యూజిక్ కాలేజీలో చదువుకున్న ఆయన భార్య మార్గరెట్ కజిన్స్ అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు.1919లో దక్షిణ భారతదేశ పర్యటనలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఒకరోజు బెంగళూరు చేరుకున్నారు. అక్కడ ఉన్నపుడే ఆయనకు మదనపల్లె వాతావరణం, జేమ్స్ కజిన్స్ కవిత్వం అంటే చాలా ఇష్టమైన ఠాగూర్, కజిన్స్ అక్కడే ఉన్న విషయం తెలుసుకుని, ఆయన విశ్రాంతి కోసం మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీ చేరుకున్నారు. ఠాగూర్‌కు ప్రశాంత వాతావరణం కలిగిన థియోసాఫికల్ కాలేజీలో ప్రతి బుధవారం భోజనాల తర్వాత విద్యార్థులంతా కలిసి పాటలు పాడేవాళ్లు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఠాగూర్, ఒక కార్యక్రమంలో పాల్గొని, ఆ సందర్భంగా ఆయన స్వయంగా తన గొంతుకతో జనగణమన ఆలపించారు. ఠాగూర్ కంఠస్వరం నుంచి వెలువడిన ఆ పాటకు విద్యార్థులంతా గొంతు కలిపారు. మార్గరేట్ కజిన్స్ కూడా ఆ సమయంలో అక్కడే ఉండి, పాటలోని దేశభక్తిని, జాతీయ భావాన్ని గమనించారు. కానీ అప్పటికి జనగణమనను ఎవరికి వారే తోచిన రీతిలో పాడుకునే వారు. ఎవరూ రాగయుక్తంగా పాడ లేదు. కనుక దానిని తానే స్వరబద్ధం చేయాలని నిర్ణయించు కున్నారు. తెల్లవారి ఆమె ఠాగూర్‌ను కలిసి జనగణమనను స్వరబద్ధం చేయాలన్న తన కోరికను వెలిబుచ్చారు. దీనికి అంగీకరించిన ఠాగూర్, ఆమెకు ఆ పాట అర్థాన్ని వివరించారు. దానికి స్వరం ఎలా ఉంటే బాగుంటుందో సూచించారు. తర్వాత మార్గరేట్ కజిన్స్ తన విద్యార్థినుల సహాయంతో ప్రతి పదానికి అర్థం తెలుసుకుంటూ దానికి. బాణీ సమకూర్చారు. తర్వాత ఠాగూర్‌కు తాను కట్టిన స్వరాన్ని వినిపించారు. కొన్ని చిన్న చిన్న సంగీత పరికరాలతో విద్యార్థులు రాగయుక్తంగా పాడిన జనగణమన గీతాన్ని విన్న ఠాగూర్ ఆమెను ఎంతగానో అభినందించారు. బెంగాల్‌లో పుట్టిన జనగణమన గీతం మదనపల్లెలో స్వరాన్ని సమకూర్చు కున్నది. రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లెలో ఉన్న సమయంలోనే ఒక ఉదయాన థియోసాఫికల్ కాలేజీ ప్రాంగణం లోని చెట్టుకింద కూర్చుని జనగణమనను ఆంగ్లం లోనికి అనువదించారు కూడా. ఆ తర్వాత దానిని తన అందమైన చేతిరాతతో రాయడమే కాకుండా, కింది భాగంలో దాని పేరు 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' అని రాశారు. దాని కింద ఫిబ్రవరి 28, 1919 అని రాసి, సంతకం చేసి, మార్గరేట్ కజిన్స్‌కు బహుమానంగా ఇచ్చారు. మదనపల్లె కాలేజీ వదలివెళ్లే ముందు ఠాగూర్ దానిని 'దక్షిణ భారతదేశపు శాంతినికేతన్' అని కీర్తించారు. నిజానికి జనగణమన దేశభక్తి గేయం. 'జన గణ మన' ఇక నుంచీ మన కొత్త గణతంత్ర రాజ్యానికి జాతీయ గీతమనీ, దీన్ని అంతా గౌరవించి ఆదరించాలనీ 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటన చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహోన్నత పాత్ర పోషించిన 'వందేమాతరం' గీతాన్ని కూడా జన గణ మనతో సమానంగా గౌరవించి ఆదరించాలి" అని ఆ రోజున రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. భారతదేశ రాజ్యాంగం ఆర్టికల్ 51ఏలో ఈ గీతాన్ని గౌరవించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రస్తావన కనిపిస్తుంది. "ప్రతి పౌరుడూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. జాతీయ పతాకం, జాతీయ గీతం వంటి రాజ్యాంగ ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్థలను గౌరవించాలి" అని ఈ చట్టం పేర్కొంటున్నది.ప్రార్ధనగా, కృతజ్ఞతగా పఠించే 52 సెకన్ల ఈ చిన్న గీతానికి ఉన్నంత గుర్తింపు , భారత దేశంలో, ప్రపంచంలో కూడా మరే గీతానికీ లేదు. మన జాతీయ గీతం దేశ సమైక్యతకు సరైన ప్రతీకగా నిలిచింది.జాతీయ గీతం, జాతీయ పతాకం పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు ప్రదర్శించడమంటే మాతృభూమిని గౌరవించు కోవడమే అవుతుంది. ఇది ప్రతి ఒక్కరిలో దేశభక్తిని, జాతీయ భావాన్ని నింపడానికి ఉపకరిస్తుంది. జనగణమన పాడినప్పుడు దాని అర్థాన్ని కూడా ఒక్కసారి మననం చేసుకోవాలి. దాని నేపథ్యాన్ని, అర్థాన్ని, ప్రాధాన్యతను గుర్తించి, తర్వాత తరం వారికి చేర్చాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# మహిళా ప్రగతే దేశసౌభాగ్యం

జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 24న నిర్వహించబడుతుంది. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై ఈ బాలికా దినోత్సవం రోజున అవగాహన కల్పిస్తారు. బాలికలపట్ల వివక్ష, అసమానత, చిన్నచూపు, లైంగిక వేదింపులు, అత్యాచారాల నుండి రక్షించడానికి కుటుంబం, మిత్రులు, సమాజం సన్నద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు.

అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. వాటిని నిర్మూలించి ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టిసారించే దిశగా భారత ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్' పేరుతో ఒక కార్యక్రమం రూపొందించింది. అందులో భాగంగా 2008లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంతో జాతీయ బాలికా దినోత్సవంను ప్రారంభించడం జరిగింది. సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యలు గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపు కుంటారు. బాలిక శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహంల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్' పేరుతో ఓ కార్యక్రమం తెచ్చింది. బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోంది. వాటిలో భాగమే జాతీయ బాలికా దినోత్సవం. 2008 నుంచీ దీన్ని ఏటా నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ, వాళ్ల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై ఈ రోజున అవగాహన కల్పిస్తోంది. తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు. సమాజంలో మహిళల హోదాను ప్రోత్సహించటానికి జరుపుకుంటారు. బాలికలు సాధారణంగా వారి జీవితంలో ఎదుర్కొనే వివిధ రకాల సాంఘిక వివక్ష, లైంగిక దోపిడీని నివారించడం అత్యవసరం. సమాజంలో మహిళల ప్రాదాన్యత, భాగస్వామ్యం గురించి అవగాహన పెంచడానికి, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, వివిధ రాజకీయ, సామాజిక, స్వచ్ఛంద సంస్థలు బాధ్యులు, సమాన విద్య, ప్రాథమిక స్వేచ్ఛ కోసం వివిధ కార్యక్రమాల ద్వారా వివరించడం జరుగుతుంది. బాలికల కంటే అబ్బాయిలకే ఎక్కువ ప్రాధాన్యత అధికంగా ఇవ్వడం సర్వత్రా వ్యక్తమవు తున్నది. ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఉంది. చైనా మొదలు అమెరికాతో సహా ఆధునికత వైపు అడుగులు వేస్తున్న భారత్‌లోనూ అమ్మాయిలపట్ల వివక్ష ఉంటుందని గ్లోబల్ ఎర్లీ అడలెసెంట్ స్టడీ పేరిట నిర్వహించిన ఒక అధ్యయనంలో భాగంగా... అమ్మాయిలు పదహారేళ్ల వయసుకు చేరుకున్నప్పటికీ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాన్‌హాఫ్‌కిన్స్ బ్లూమ్ బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కిడ్స్ సంయుక్తంగా 15 దేశాల్లో నిర్వహించిన సర్వేలో అమ్మాయిలు శారీరకంగా బలహీనులనే విషయం... చిన్న వయసులోనే ముద్ర పడేలా చేయడంలో తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తేలింది. చిన్నారులపై లైంగిక వేధింపులు నేడు మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం నిత్యం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మైనర్లపై అత్యాచారాలు ఆగడంలేదు. సమాజంలో అమ్మాయిలు, మహిళలకు రక్షణ కరువ వుతున్నది. ఎంతోమంది ఆడ పిల్లలు ఈ లోకంలో అడుగుపెట్టక ముందే బలవంతపు మరణాలకు బలవు తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మానవతా విలువలు మాత్రం పెరగడం లేదు. దానికి నిదర్శనం భ్రూణ హత్యలు. గర్భస్త శిశువుల లింగ నిర్ధారణను నిషేధించి తద్వారా ఆడపిల్లల భ్రూణ హత్యలు నివారణ కోసం 1994లోనే చట్టం తెచ్చినా అది ఏనాడూ పకడ్బందీగా అమలైన జాడలు లేవు. దేశంలో నానాటికీ అడపిల్లల సంఖ్య తగ్గిపోతూ, కొనసాగితే చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందనేది కాదన లేని వాస్తవం. ఇదే కాక ప్రపంచంలో జరుగుతున్న బాల్య వివాహాల్లో 40% పైగా భారతదేశం లోనే జరుగుతున్నాయని ఇటీవలే యూనిసెఫ్ గణాంకాలను వెల్లడించింది. బాలికల ఉన్నత విద్య మరో సమస్యగా మారింది, ఇప్పటికి అధిక రాష్ట్రాల్లో 40%నికి పైగా పదో తరగతి కంటే ముందే బడి మాని వేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేసినా ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ తగ్గడంలేదు. బాల్య వివాహం కారణంగా రాష్ట్రంలోని 28 శాతం మంది బాలికలకు పద్దెనిమిది సంవత్సరంలోపే వివాహాలు చేస్తున్నారు. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్య నివేదిక ప్రకారం భారత దేశంలో వయోజన నిరక్షరాస్యులలో మహిళలు 68 శాతం వున్నారు. పంతొమ్మిది ఏళ్లు నిండక ముందే దాంపత్య జీవితంలో అడుగు పెడుతున్నారు. బాలికల సంఖ్య 41 శాతం అని జనగణనలో తేలింది. బాల్య వివాహాలు, పాఠశాలలు చేరువ, అందుబాటులో పూర్తి స్థాయిలో లేకపోవడం, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత, లైంగిక విచక్షణ వంటి సమస్యలు భారతావనిలో బాలిక విద్యకు శాపంగా పరిణ మించింది. పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు డెబ్బై శాతం అన్న అంచనాలు తీవ్రంగా కలవర పరుస్తున్నాయి. మహిళా కార్మికశక్తి, వారి ఆదాయం, అక్షరాస్యత స్థాయి, జననాల విషయం, తదితర అంశాల్లో అధమస్థాయిలో వున్న 20 దేశాల్లో మన దేశం ఒకటి కావడం ఆందోళనకర అంశం. మహిళలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదు. ఆడపిల్లలు ప్రతి రంగంలో, చదువులో మొదలుకుని ఆటల దాకా, రాణిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నారు.బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియ చేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కరించ బడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడుతున్నది. ఆడపిల్లలకి తప్పనిసరి అవసరమైన భద్రత, సాంకేతిక విజ్ఞానాన్ని సేవల్ని అందుబాటులో వుంచాలి. బాలికలను విద్యావంతులను చేసి, బాల్య వివాహాలు తగ్గించడంలో, విద్యను అభ్యసించిన బాలికలు అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందడంలో మార్గదర్శకంగా నిలవడం ద్వారా మహిళత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా సహాయపడుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల్లో నలభై శాతంకి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ స్పష్టం చేసింది.

సమాజంలో చైతన్యం నింపాలంటే ముందు మహిళ జాగృతం కావాలి. స్త్రీ కళ్లు తెరిస్తే కుటుంబం, దానితో పాటు గ్రామం, రాష్ట్రం, దేశం పురోగతి బాట పడతాయి' అని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గతంలో చేసిన వ్యాఖ్యలు గుర్తుంచు కోవాలి. కౌమారదశలో ఆడపిల్లలు, యువతులు ఎదుర్కొనే వివిధ రకాల హింసను అంతం చేయాలి.

బాలికలు వారి చట్టపరమైన హక్కులు మరియు జీవిత వాస్తవాలను గురించి తెలుసు కోవాలి. వారు మంచి విద్య, పోషణ, ఆరోగ్య సంరక్షణ హక్కులను కలిగి ఉంటారని అవగాహన కల్పించాలి. గృహ హింస చట్టం 2009, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 నిషేధించడం మరియు కట్న నిషేధ చట్టం 2006 వంటి చట్టాల గురించి వారి సరైన హక్కులు పొందడానికి మరియు జీవితంలో అన్ని సవాళ్లను ఎదురుకొని ముందుకు వెళ్ళాలి.

## ఏఐతో మానవ మేధస్సు మసకబారుతున్నదా!

వ్యక్తులు, పౌర సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి నమోదు చేసుకోవడానికి విద్య అనే పదునైన సాధనం దోహదపడుతున్నది. విద్య మనందరి ప్రాథమిక హక్కు. "విద్య లేని వాడు వింత పశువు" అన్నారు పెద్దలు. నేడు అత్యాధునిక శాస్త్రసాంకేతికత అద్భుతాలను సృష్టిస్తూ భూగోళాన్ని కుగ్రామంగా మార్చి వేసింది. ప్రపంచ 820 కోట్ల మానవాళి క్షణాల్లో స్మార్ట్‌ఫోన్ లేదా అంతర్జాల వేదికల్లో కలుసుకోగలుగుతున్నారు. "కృత్రిమ మేధ లేదా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)"తో పాటు "ఆటొమేషన్" వలయంలో చిక్కి నేటి ఆధునిక మానవుడు తనను తాను మైమరిచి పోతున్నాడు. ఆధునిక విద్య కొరవడిన వ్యక్తి మూగ, చెవిటి వాడిగా మిగిలిపోయే దుస్థితులు వచ్చాయి. ప్రజా సంక్షేమ వారది విద్య మాత్రమే అని తేలిపోయింది. డబ్బుతో సాధించలేనివి విద్యతో సుసాధ్యం అవుతున్నాయి. విద్యావంతుల జనాభా కలిగిన దేశం అభివృద్ధి పథంలో వడి వడిగా పయనిస్తున్నది. నాణ్యమైన విద్య కల్పించాల్సిన బాధ్యత ప్రధానంగా ప్రభుత్వాల పైన, తర్వాత ప్రైవేట్ సంస్థల పైన ఆధారపడుతున్నది. విద్య ద్వారా విషయపరిజ్ఞానం, వివేకం, నైపుణ్యాలు, జీవన విలువలు, సాధారణ జ్ఞానం అందుతాయి. ప్రజా సమస్యలకు చక్కటి పరిష్కారాలు, సరళ జీవన విధాన రీతులకు విద్య దోహదపడుతుంది. పేదరిక నిర్మూలన, లింగ సమానత్వం, అసమానతల తొలగింపు, సామాజిక సమ్మిళిత అభివృద్ధి, శాస్త్ర సాంకేతిక ప్రగతి పరుగులు, కుటుంబ సంక్షేమం లాంటిప్రధాన ప్రయోజనాలు విద్య వల్ల ఒనగూడుతాయి. విద్య ప్రాముఖ్యతను సాధారణ ప్రజలకు వివరించడానికి, సమాజ చైతన్యానికి ప్రతి ఏట 24 జనవరి రోజున ఐరాస నేతృత్వంలో 2019 నుంచి ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ విద్యా దినోత్సవం" జరుపుకుంటున్నాయి. అంతర్జాత విద్యా దినోత్సవం-2025 ఇతివృత్తంగా "ఏఐ - విద్య : ఆటోమేషన్ ప్రపంచంలో మానవ గుర్తింపును సంరక్షించడం" అనే అంశాన్ని తీసుకున్నారు. అత్యాధునిక ఏఐతో పాటు ఆటోమేషన్ రంగం కలిసి మానవుడి జీవన సరళిని సమూలంగా మార్చు వేసే స్థాయి వచ్చింది. మనిషి కనుగొన్న ఏఐ-ఆటోమేషన్ పరిజ్ఞానాలు మానవ గుర్తింపు లేదా హుమన్ ఐడెంటిటీని ప్రశ్నార్థకం చేస్తున్నట్లు తోస్తున్నది. మానవ హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారాలతో ఐరాస సూచించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన సుసాధ్యం అవుతున్నది. ఇలాఅత్యాధునిక విద్యతో మానవ ప్రగతి వాయు వేగంతో పరుగులు పెడుతున్నది. విద్య ప్రాధాన్యాలను అవగాహన పరచడం, యువత/బాలలకు నాణ్యమైన విద్యను అందించడం, సృజనకు పదును పెట్టడం, వినూత్న అవిష్కరణలకు పట్టం కట్టడం, సమాజ స్థితిగతులు/సవాళ్లను అధ్యయనం చేయడం, జీవనశైలిని మార్చడం, సామాజిక సంబంధాలను ప్రభావితం చేయడం, మన వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడం, మనిషి ఆలోచనలను కట్టడి చేయడం, జ్ఞాపకశక్తిని పలుచబరచడం, సంక్లిష్ట సమస్యలకు సత్వర పరిష్కారాలు చూపడం, ఆలోచనాసామర్థ్యాలను తగ్గించడం లాంటి చర్చలను అంతర్జాతీయ విద్యా దినోత్సవ వేదికగా నిర్వహించాలి. మానవుడు అందించిన ఏఐ, కల్పన (అల్‌గారిథమ్స్) గణిత సాంకేతిక సూచనలతో పని చేస్తున్న టెక్నాలజీ, మానవ ఆలోచనలు, భావోద్వేగాలు, సృజన, వినూత్న ఆవిష్కరణలు, అవగాహనలను ఏ నాడు అధిగమించలేదని, మానవ గుర్తింపును లేదా మానవ చాతుర్యాలను మసకబార్చడం అసాధ్యమని తెలుసుకోవాలి. శాస్త్ర సాంకేతిక సృష్టి మనిషి ఇచ్చే ఆదేశాల మీద మాత్రమే ఆధారపడి ఉంటుందని తెలుసుకోవాలి. విద్యా వృక్షపు వేర్లు చేదుగా ఉన్నప్పటికీ అది అందించే పండ్లు మాత్రం తియ్యగా ఉంటాయి. ప్రపంచ సానుకూల మార్పులకు సరైన విద్య అనే పదునైన ఉపకరణం మాత్రమే. విద్యలో పెట్టుబడికి అత్యధిక వడ్డీ చెల్లించబడుతుంది. అజ్ఞాన చీకట్లను చిదిమే ప్రకాశవంతమైన దివ్వె విద్య మాత్రమే. ఒక వ్యక్తి విద్యావంతుడు అయితే అనేక అపూర్వ అవకాశాలు ఆయన వెంట పడతాయి. ఇలాంటి అత్యంత శక్తివంతమైన విద్యను అందరూ సొంతం చేసుకొని, కుటుంబాలు, పౌర సమాజం, ప్రపంచ అభివృద్ధికి కృషి చేయాలని సవినయంగా కోరుకుందాం. విద్యను అందరికీ అందుబాటులో ఉంచుదాం.

## గెలిచినా హవా వాళ్లదేనా

విజయవాడ, జనవరి 23, ఆంధ్రప్రదేశ్ లో గత ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించింది. జనసేన వంద శాతం స్ట్రయిక్ రేట్ ను సాధించింది. 21 అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ ఆరు స్థానాల్లోనే గెలిచింది. మిగిలిన అన్ని స్థానాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలిచారు. తెలుగుదేశం పార్టీ గెలిచిన స్థానాలతో పాటు వైసీపీ, బీజేపీ ఓటమి పాలయిన శాసనసభ నియోజకవర్గాల్లో సహజంగా టీడీపీ ఇన్ ఛార్జులదే పై చేయి అయింది. ఎందుకంటే టీడీపీ యాభై వసంతాలు నిండిన పార్టీ. దానికి అన్ని నియోజకవర్గాల్లో బలమైన నేతలతో పాటు క్యాడర్ కూడా ఉంది. జనసేన ఆవిర్భవించి పదేళ్లయినా అది క్షేత్ర స్థాయిలో బలోపేతం కాలేదు.జనసేనకు సామాజికవర్గం, అభిమానులు మాత్రమే ఓటు బ్యాంకు. అంతే తప్ప అన్ని నియోజకవర్గాల్లో బలమైన నేతలు లేరు. దాదాపు వందకు పైగా నియోజకవర్గాల్లో జనసేన నేతలను వెతుక్కోవాల్సిన పరిస్థితి నేటికీ ఉంది. అయితే కూటమిగా మూడు పార్టీలు కలసి పోటీ చేయడం, జగన్ ను ఓడించడానికి అందరూ కలసి సమిష్టిగా ఒకరినొకరు సహకరించుకోవడంతో ఇంతటి అద్భుతమైన విజయం సాధించిందన్న అంశంలో ఎవరికీ వేరే ఆలోచన లేదు. అయితే ఆ నియోజకవర్గాల్లో క్యాడర్ మాత్రం ఇప్పుడు ఇబ్బందులు పడుతుంది. టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో మిత్రపక్షమైన జనసేన నేతలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు చాలా చోట్ల నుంచి వినిపిస్తున్నాయి. ంశ్రీబనీ ఖీవజీట – మూడో రోజు చంద్రబాబు దావోస్ లో పర్యటన టీడీపీ ఎమ్మెల్యేలు తప్పు కాకున్నా... అది టీడీపీ ఎమ్మెల్యేల తప్పు కాదు. ఎవరైనా తమ పార్టీ నేతలకు, తమ పార్టీకి చెందిన వారికే ఎందులోనైనా ప్రాధాన్యత ఇవ్వాలని చూస్తారు. ఇతర పార్టీల నేతలకు వారు మిత్రపక్షమైనా ప్రయోజనాలు చేకూరిస్తే భవిష్యత్ లో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. అందుకే టీడీపీ ఎమ్మెల్యేల వైఖరిని కూడా తప్పుపట్టడానికి లేదు. వాళ్లు తమ వారికే న్యాయం చేయాలనుకుంటారు. పదవుల్లోనైనా, కాంట్రాక్టు పనులనైనా వారికే అప్పగించేందుకు సిద్ధమవుతారు. ఇది జనసేన స్థానిక నేతలకు మింగుడు పడటం లేదు. తూర్పు గోదావరి జిల్లాలోనే ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయి. దీంతో జనసేన స్థానిక నాయకులు తమకు న్యాయం చేయడం లేదని అధినాయకత్వానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదుజాగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో తనకు ప్రాధాన్యత ఇవ్వలేదంటూ జనసేన నేత సంతోష్ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఇందుకు ఉదాహరణ. ప్రస్తుతం విజయవాడలో చికిత్స పొందుతున్నారు. జనసేన ప్రాధాన్యత ను తగ్గిస్తున్నారంటూ ఎంఎల్ఏ ముందు ఆత్మహత్య యత్నం చేసిన జనసేన నాయకుడు సంతోష్పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి కొనసాగిస్తున్నారు. టిడిపి నాయకుల దురుసు వైఖరిని ప్రశ్నించిన పట్టించుకోకపోవడంతోనే ఆత్మహత్య యత్నానికి సంతోష్ పాల్పడ్డారని స్థానిక జనసేన నేతలు తెలిపారు. ఇలా అనేక నియోజకవర్గాల్లో పరిస్థితులు ఉన్నప్పటికీ పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదన్న వార్తలు అనేకం వస్తున్నాయి. అందుకే పవన్ ఫీల్డ్ లెవెల్ లో ఫోకస్ చేయకపోతే ఉన్న పార్టీ క్యాడర్ చేజారి పోయే పరిస్థితులు నెలకొన్నాయి

## కాలుష్య నియంత్రణ చేయాలని ఆందోళన ఆదివాసి గిరిజన సంఘం...

డుంబ్రిగుడ కాలుష్యం నియంత్రణ చేయాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ డుంబ్రిగూడ, కించమండ మధ్యలో ఉన్న కొత్త వలస గ్రామ సమీపంలో రోడ్డు పనులు భాగంగా ప్రధాన రోడ్డు రహదారి మళ్ళించగా రాకపోకలు జరుగుతున్న వాహనాలు వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ విషయంపై అధికారులు చొరవ తీసుకొని కాలుష్య నియంత్రణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కమలం... ఎవరి పరం...


విజయవాడ, జనవరి 23, ఏపీ బీజేపీలో జిల్లా అధ్యక్షుల ఎంపిక పూర్తి కావడంతో రాష్ట్ర పార్టీ బాధ్యతలు ఎవరికి దక్కుతాయనే దానిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. పురందేశ్వరి స్థానంలో మరొకరికి అవకాశం కల్పిస్తారని ప్రచారం జరుగుతున్నా ఆమెను కొనసాగించ అవకాశాలు లేకపోలేదని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.బీజేపీ అధ్యక్ష పీఠంపై కన్నేసిన వారిలో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి సుజనా చౌదరి, ప్రస్తుతం ఏపీ క్యాబినెట్‌లో ఉన్న సత్యకుమార్ యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి కోసం సుజనా చౌదరి కొన్ని రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర మంత్రిగా పనిచేసిన సుజనా చౌదరి విజయవాడ ఎంపీగా పోటీ చేయాలని భావించినా ఆయన చివరకు పశ్చిమ ఎమ్మెల్యే టిక్కెట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మంత్రి వర్గంలో కూడా చోటు దక్కలేదు. బీజేపీ తరపున సత్య కుమార్ యాదవ్‌కు క్యాబినెట్‌లో చోటు దక్కింది.ఏపీలో సొంతంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ గత పదేళ్లుగా రకరకాల ప్రయోగాలు చేసింది. తొలుత కాపు సామాజిక వర్గాన్ని దరి చేర్చుకుంటే బీజేపీకి రాజకీయంగా కలిసి వస్తుందని ఆ పార్టీ భావించింది. అందులో భాగంగా సోము వీర్రాజు, కన్నా లక్ష్మీనారాయణలకు అధ్యక్ష బాధ్యతలు దక్కాయి. సామాజిక సమీకరణల్లో బీజేపీ ప్లాన్ పెద్దగా వర్కౌట్ కాకపోవడంతో చివరకు పురందేశ్వరికి అధ్యక్ష బాధ్యతలు దక్కాయి.పురందేశ్వరి సారథ్యంలోనే సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. గత ఎన్నికల్లో టీడీపీతో బీజేపీ జట్టు కట్టడంలో పురందేశ్వరి ప్రయత్నాలు కొంత మేరకు ఉన్నాయి. ఆ తర్వాత టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి ఎన్నికల్లో పోటి చేయడం, సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలు ఘన విజయం సాధించడం తెలిసిందే. పురంధేశ్వరి తర్వాత ఆ పార్టీ అధ్యక్ష పగ్గాలు ఎవరికి దక్కుతాయనే చర్చ కొంత కాలంగా బీజేపీలో సాగుతోంది. ఈ క్రమంలో రెండ్రోజుల క్రితం అన్ని జిల్లాల్లో అధ్యక్ష ఎన్నికలు కొలిక్కి రావడంతో రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలు ఎవరికి దక్కుతాయనే చర్చ మొదలైంది.ప్రస్తుతం పార్టీ అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి 2023 జూలైలో ఈ బాధ్యతలు చేపట్టారు. నెలాఖరులోగా కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. నెలాఖరులోగా ఏపీ కొత్త అధ్యక్షుడిని నియమిస్తారని ఆ పార్టీలో ప్రచారం జరుగుతోంది. పురంధేశ్వరిని కొనసాగిస్తారనే వాదనలు కూడా ఉన్నాయి. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, మంత్రి సత్యకుమార్ యాదవ్, డాక్టర్ పార్థసారధి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌తో పాటు రేసులో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి పేరు కూడాఉంది.ప్రస్తుతం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో నిమగ్నమైన ఉన్న ఆ పార్టీ అగ్రనేతలు కొత్త అధ్యక్షుడి నియామకంపై అభిప్రాయాలు తెలపాలని రాష్ట్ర పార్టీ నేతలకు సూచించినట్టు చెబుతున్నారు. ఈ క్రమంలో ఎవరికి వారు తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. సోము వీర్రాజు వంటి నేతలు కూడా ఢిల్లీలో తన ప్రయత్నాల్లో ఉన్నారు. ఏపీలో సొంతంగా ఎదగాలని కొన్నేళ్లుగా ప్రయత్నిస్తోన్న బీజేపీ ఈసారి ఎవరికి ఛాన్స్ ఇస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# జీవీఎల్ గాయాబ్....

గుంటూరు, జనవరి 23, జీవీఎల్ నరసింహారావు.. ఐదేళ్ల క్రితం వరకు ఆయనెవరో తెలియదు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ నామినేట్ అయి విశాఖలో తిష్టవేసి రాజకీయాలు చేస్తూ ఒక్కసారిగా లైమ్‌లైట్‌లోకి వచ్చేశారు. ప్రెస్‌మీట్లు పెట్టి స్టేట్‌మెంట్లు ఇస్తూ తెగ హడావుడి చేసేవారు. ఇప్పుడు ఆయన రాజ్యసభ పదవీ కాలం ముగిసింది. మాజీ ఎంపీ అయిపోయారు జీవీఎల్.దాంతో ఒక్కసారిగా ఆయన సైలెంట్ అయిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పత్తా లేకుండా పోయారు జీవీఎల్. బీజేపీ కార్యక్రమాల్లో గానీ, ఇటు కూటమి యాక్టివిటీలో కానీ కనిపించడం లేదు. చివరకు ప్రధాని మోదీ విశాఖ పర్యటనకు వచ్చినా ఆయనకు పెద్దగా ప్రాధాన్యత లేకుండా పోయింది. వైసీపీ హయాంలో మోదీ విశాఖకు వస్తే జీవీఎల్ తెగ హడావుడి చేసేవారు. ప్రధాని ప్రసంగాన్ని కూడా ఆయనే తెలుగులోకి అనువాదం చేశారు. ఇటీవల మోదీ విశాఖ టూర్‌కు వస్తే జీవీఎల్ కానరాకపోగా, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రధాని స్పీచ్‌ను తెలుగులోకి అనువదించారు.పండుగ సందర్భంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించి విశాఖ ప్రజలను జీవీఎల్ ఆహ్వానించారు. ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్ లో సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా కార్యక్రమాలు ఏర్పాటు చేసి మళ్లీ తెరమీదకు వచ్చే ప్రయత్నం స్టార్ట్ చేశారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు కూడా ఎన్నికలకు ముందు జీవీఎల్ ఇదే వేదికగా సంక్రాంతి సంబరాలతో హడావుడి చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల నుంచి చందాలు తెచ్చి పండుగ పేరుతో ఆర్భాటం చేశారటన్న టాక్ కూడా ఉంది.ఎన్నికల ముందు కనుమరుగైన జీవీఎల్ మళ్లీ సంక్రాంతి సంబరాలతో ప్రత్యక్షం కావడం టాపిక్ మారింది. దాదాపుగా ఏడాది తర్వాత విశాఖలో సంక్రాంతి సెలబ్రేషన్స్‌తో ఆయన రీఎంట్రీ ఇవ్వడం వెనుక కారణమేంటన్న దానిపై ఆరా తీస్తున్నాయి రాజకీయ వర్గాలు. ఎలాంటి రాజకీయ ప్రయోజనం లేకుండా సంబరాలు ఎందుకు నిర్వహిస్తారన్న చర్చ జరుగుతోంది.అయితే ఇందుకు బలమైన కారణమే ఉందట. ఎన్నికలకు ముందు ప్రజల్ని ఆకర్షించేందుకు వేడుకలు చేసి, ఇప్పుడు చేయకపోతే రాజకీయ అవకాశవాది అనే ముద్ర పడే ప్రమాదం ఉందని భావించి ఈ సారి కూడా వేడుకలు చేసి ఉంటారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉనికి చాటుకోవడం కోసం ఇలాంటి ట్రిక్స్ చేయడం షరా మామూలేనని బీజేపీ వర్గాలు కూడా లైట్ తీసుకుంటున్నాయట.యూపీ కోటాలో రాజ్యసభకు నామినేట్ అయిన జీవీఎల్ నరసింహారావు..ఆ తర్వాత విశాఖలో నివాసం ఏర్పాటు చేసుకుని, ఆఫీసు పెట్టి యాక్టివిటీ నడిపించారు. గత ఎన్నికల్లో బీజేపీ తరుపున విశాఖ ఎంపీగా పోటీ చేయాలని ఉవ్విళ్లూరారట. టీడీపీ, జనసేన జతకట్టినా విశాఖ ఎంపీ టికెట్ తనకే వస్తుందంటూ గ్రౌండ్ వర్క్ కూడా చేశారు.కుల సంఘాల నేతలతో సమావేశాలు పెట్టి, బీసీ కోటా కోసం వారిని ఢిల్లీకి తీసుకువెళ్లడంతో పాటు, రైల్వే సంబంధిత ఇష్యూస్‌పై అధికారులతో సంప్రదింపులు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం, కేంద్రం నుంచి నిధులు తెస్తానంటూ హడావుడి చేశారు. కూటమిలో టీడీపీ నుంచి విశాఖ ఎంపీ అభ్యర్థిగా భరత్ పేరు ఖరారైనా సరే టికెట్ తనకే వస్తుందంటూ విశాఖలో స్వాగత ర్యాలీలు కూడా చేయించుకున్నారు. కానీ చివరకు జీవీఎల్‌కు ఆశాభంగం తప్పలేదు. ఎప్పుడైతే టికెట్ దక్కలేదో విశాఖలో పత్తా లేకుండా పోయారు. పార్టీ మీటింగ్‌లలో కూడా కనిపించడం మానేశారు జీవీఎల్.సంక్రాంతి సంబరాల పేరుతో జీవీఎల్ నరసింహరావు మళ్లీ తెరమీదకు రావడం అయితే ఆసక్తికర చర్చకు దారి తీసింది. అవకాశవాద రాజకీయ నాయకుడు అనే ముద్ర తొలగించుకోవడానికే ఈ వేడుకలు చేశారా..సరికొత్తగా మరో పొలిటికల్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయబోతున్నారా..? అన్నది ఆసక్తి రేపుతోంది. జీవీఎల్ రాజకీయ అడుగులు ఎటువైపు పడబోతున్నాయో వేచి చూడాలి మరి.

## భారత అణుశక్తి పితామహుడు హోమీ జహంగీర్ బాబా

## -నేడు ఆయన వర్ధంతి




హోమీ జహంగీర్ భాభా 1909 అక్టోబరు 30 బొంబాయి లో ఒక సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించారు. బాబా భారతీయ కేంద్రక భౌతిక శాస్త్రవేత్త, వ్యవస్థాపక డైరక్టరు, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటాల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) లో భౌతిక శాస్త్ర అధ్యాపకునిగా పనిచేసాడు.అతనిని "భారత అణు కార్యక్రమానికి పితామహుడు" అని పిలుస్తారు. అతను భాభా అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్మెంట్, ట్రాంబే (ఏఈఈటి) కు వ్యవస్థాపక డైరెక్టర్. అతని గౌరవార్థం ఆ సంస్థకు భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ అని పేరు పెట్టారు. భారత అభివృద్ధికి మూలస్తంభాలుగా ఉన్న టీఐఎఫ్ఆర్, ఏఈఈటి అణ్వాయుధాల సంస్థలకు అతను డైరెక్టర్‌గా పర్యవేక్షించాడు. అతనికి ఆడమ్స్ ప్రైజ్ (1942), పద్మభూషణ (1954) పురస్కారాలు లభించాయి. 1951, 1953?1956లలో అతను భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతికి నామినేట్ చేయబడ్డాడు.


భాభా సాధారణంగా భారత అణుశక్తికి పితామహుడిగా గుర్తించబడ్డాడు. అంతేకాకుండా, యురేనియం నిల్వల కంటే దేశంలోని విస్తారంగా లభ్యమవుతున్న థోరియం నిల్వల నుండి శక్తిని వెలికి తీయడంపై దృష్టి సారించే వ్యూహాన్ని రూపొందించిన ఘనత ఆయనకు ఉంది. ఈ థోరియం కేంద్రీకృత వ్యూహం ప్రపంచంలోని అన్ని దేశాల కంటే భిన్నంగా ఉంది. ఈ వ్యూహాత్మక లక్ష్యాన్ని సాధించడానికి భాభా ప్రతిపాదించిన విధానం భారతదేశం యొక్క మూడు దశల అణు విద్యుత్ కార్యక్రమంగా మారింది.1966 జనవరి 24 న మోంట్ బ్లాంక్ సమీపంలో ఎయిర్ ఇండియా ఫ్లైట్ 101 కూలిపోవడంతో హోమి జె. భాభా మరణించాడు.

### అనకాపల్లి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
### మంత్రి కొల్లు రవీంద్ర

అనకాపల్లి కలిసి పనిచేసి జిల్లానుపారిశ్రామిక, వ్యవసా య రంగాల్లో పరుగులు పెట్టిద్దామని,జిల్లానుఅన్ని రంగా ల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొ న్నారు.అనకాపల్లి జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రణాళికల అమలుపై అధికారులు, ప్రజాప్రతినిధులతో కలెక్టరేట్లోని సమావేశ మందిరం లో సమీక్ష నిర్వహించా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ అనకా పల్లి జిల్లాను ఐదేళ్లలో రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచేలా సమష్టి గా కృషి చేయాలన్నారు. తలసరి ఆదాయంలో విశాఖపట్నం జిల్లా మొదటి స్థానంలో వుండగా, పక్కనే వున్న అనకాపల్లి జిల్లా 12వ స్థానం లో ఉందని అన్నారు. జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొ ని 2029 నాటికి విశాఖపట్నంతో సమానంగా అనకాపల్లిని అభివృద్ధి లో నిలిపేందుకు అధికారులు కలసి కట్టుగా పనిచేయాలని అన్నారు. ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులను నిర్దే శిత గడువులోగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. జిల్లాలో రోడ్ల మర మ్మతులను ఈ నెలా ఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మం జూరైన నిధులు మార్చి నెలాఖరు లోగా ఖర్చు చేయాలని, అందువల్ల అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు

## జనగణమన ను జాతీయ గీతంగా స్వీకరించింది ఈరోజే.

## -1950 జనవరి 24




జనగణమన భారత జాతీయగీతం. నోబెల్ బహుమతి గ్రహీత, రవీంద్రనాథ్ టాగోర్ రాసిన బెంగాలీ గీతం లోని మొదటి భాగం ఇది. 1911లో మొదటి సారిగా పాడిన ఈ గీతాన్ని 1950 జనవరి 24 న జాతీయగీతంగా రాజ్యాంగ సభ స్వీకరించింది. ఈ గీతానికి సంగీత బాణీ కూడా ఠాగూర్ సృష్టించాడు. బాణీ కనుగుణంగా ఈ గీతాలాపన చేసేందుకు 52 సెకండ్లు పడుతుంది. అప్పుడప్పుడు మొదటి, చివరి పాదాలను మాత్రమే పాడే పద్ధతి కూడా ఉంది. దీనికి 20 సెకండ్లు పడుతుంది.

ఠాగూర్ జనగణమనను 1919 లో మదనపల్లెలో ఆంగ్లములోకి తర్జుమా చేశాడని భావిస్తారు. ఈ తర్జుమా ప్రతి నేటికినీ బీసెంట్ థియోసాఫికల్ కాలేజి మదనపల్లెలో యున్నది. మొదటిసారి బహిరంగంగా జనగణమన గీతాన్ని ఆలపించింది మదనపల్లెలోనే. 1919 ఫిబ్రవరి 28న తన స్నేహితుడు, బిసెంట్ థియోసాఫికల్ కాలేజి ప్రిన్సిపాలు అయిన జేమ్స్ హెచ్. కజిన్స్ కోరిక మేరకు కొంత మంది విద్యార్థులను పోగు చేసుకొని జనగణమనను బెంగాలీలో ఆలపించాడు.

జనగణమన-అధినాయక జయ హే
భారతభాగ్యవిధాతా!
పంజాబ సింధు గుజరాత మరాఠా ద్రావిడ ఉత్కళ బంగ
వింధ్య హిమాచల యమునా గంగా
ఉచ్ఛలజలధితరంగ
తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిష మాగే,
గాహే తవ జయగాథా?
జనగణమంగళదాయక జయ హే
భారతభాగ్యవిధాతా!
జయ హే, జయ హే, జయ హే, జయ జయ జయ జయ హే??


తెలుగులో అర్థం : పంజాబు, సింధు, గుజరాత్ మహారాష్ట్ర లతో కూడిన పశ్చిమ తీర ప్రాంతాము
తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, తుళు భాషలతో కూడిన ద్రావిడ ప్రాంతము
ఒరిస్సా మొదలైన రాష్ట్రాలతో కూడిన తూర్పు తీర ఉత్కల ప్రాంతము
ఈశాన్య రాష్ట్రాలతో కూడిన బెంగాల్ ప్రాంతము..
వింధ్య హిమాలయ పర్వతాలు,
యమున గంగలు
పై కంటే ఎగసే సముద్ర తరంగాలు
ఇవన్నీ..
తమరి శుభ నామమే తలుచుకుంటూ ఉన్నాయి
తమరి శుభ ఆశిస్సుల నే కోరుకుంటున్నాయి
తమరి విజయగాధనే పాడుకుంటున్నాయి
ఓ జనసమూహాల మనసుల అధినాయక..
మీకు జయము!
ఓ భారత భాగ్య విధాత, మీకు జయము! నిత్య జయము!

# నక్సల్స్ లేని దిశగా భారత్

అయిదు దశాబ్దాలకుపైగా ప్రభుత్వాలకు కంటిమీద కునుకు లేకుం డా చేసిన మావోయిస్టు ఉద్యమం దేశంలో ఇప్పుడు కనుమరు గు కానుందా? అంటే అవుననే అనిపిస్తోంది. ఒకప్పుడు దేశంలోని చాలా రాష్ట్రాలకు విస్తరించిన ఈ ఉద్యమం ఇప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. దండకారణ్య ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని కార్యకలాపాలు సాగి స్తున్న మావోయిస్టులను తుదముట్టించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం గత రెండు మూడేళ్లుగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది.2026 మార్చి చివరినాటికి మావోయిస్టురహిత దేశంగా మార్చడమే తమ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గత ఏడాది ప్రకటించిన తర్వాత మావోయిస్టుల ఏరివేత జోరందుకుంది. ఛత్తీస్‌గఢ్-ఒడిషా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు ఇప్పటికీ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. దీనిపై తాజాగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. ఇది నక్సల్ లేని భారత్ దిశగా కీలక అడుగని వ్యాఖ్యానించారు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉన్నదన్నారు. ఇది నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బ. మన భద్రతా బలగాలకు ఇది గొప్ప విజయం. నక్సల్స్‌లేని భారత్ దిశగా ఇది ఓ కీలక అడుగు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉన్నది. సీఆర్‌పీఎఫ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బలగాలు ఈ జాయింట్ ఆపరేషన్‌లో భాగమయ్యాయి అని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్-ఒడిషా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడాలో జనవరి 19 రాత్రి నుంచి ఈ ప్రత్యేక ఆపరేషన్ జరగుతున్నది. పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కీలక నేతలు కూడా ఉన్నారు.తాజాగా రెండు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ ఒడిశా సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో కీలక నేతలు చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, మనోజ్, స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు గుడ్డు ఉన్నట్లు తెలుస్తోంది.ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై గతంలో అలిపిరి వద్ద జరిగిన దాడి కేసులో చలపతి ప్రధాన నిందితుడు. చిత్తూరు జిల్లాకు చెందిన ఇతనిపై కోటి రివార్డు ఉండడం గమనార్హం. రెండు రాష్ట్రాల సరిహద్దు జిల్లాలయిన గరియాబంద్, నౌపాడ జిల్లాల అడవుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు తిరుగుతున్నారన్న నిఘావర్గాల సమాచా రం ఆధారంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా వెయ్యి మందికిపైగా కలిసి మూడు రోజుల పాటు చేపట్టిన ఆపరేషన్‌లో మావోయిస్టులకు చావుదెబ్బ తగిలింది. కొత్త ఏడాది ప్రారంభమయిన 20 రోజుల్లోనే ఇప్పటివరకు 40 మందికి పైగా మావోయిస్టు లు మృతి చెందారు.

ఈ నెల 16న బీజాపూర్ జిల్లాలోని కాంకేర్‌లో జరిగి న ఎన్‌కౌంటర్‌లో18 మంది మావోయిస్టులు హతమయ్యారు. రెండు ఎన్‌కౌంటర్లలో పలువురు కీలక నేతలు హతమైనట్లు మావోయిస్టు వర్గాలే అంగీకరించాయి. ఇక గత ఏడాది జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో 219 మం ది నక్సల్స్‌ను భద్రతా దళాలు మట్టుబెట్టాయి.వీరంతా బస్తర్ ప్రాంతంలో హతమైనవారే. ఎన్‌కౌంటర్ల సందర్భంగా భద్రతా దళాలు ఏకే47, ఎస్ఎల్ఆర్ రైఫిళ్లలాంటి అత్యాధునిక ఆయుధాలు, మందుగుండు డంప్‌ల ను స్వాధీనం చేసుకున్నాయి. అంతేకాకుండా 800 మందిని అరెస్టు చేయ గా, మరో 802 మంది ఆయుధాలను వదిలిపెట్టి పోలీసు అధికారుల ముందు లొంగిపోయారు. తాజా ఎన్‌కౌంటర్‌పై అమిత్ షా స్పందిస్తూ నక్సల్ ఉద్యమం అవసాన దశలో ఉందని వ్యాఖ్యానించడం గమనార్హం.అమిత్ షా వ్యాఖ్యలు నిజమేనని కొంతకాలంగా జరుగుతున్న ఘటనలను చూస్తే అర్థమవుతుంది. నక్సల్స్‌కు ఆయువుపట్టయిన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాలు ఏర్పడడంతో కేంద్రం బస్తర్ అటవీ ప్రాంతంలో చేపట్టిన 'ఆపరేషన్ ప్రహార్'కు స్థానిక బలం కూడా తోడయింది. అత్యాధునిక ఆయుధాలు,డ్రోన్లు లాంటి సాంకేతికతతో కేంద్రబలగాలు చేపట్టే గాలింపు చర్యలకు రాష్ట్ర పోలీసు బలగాలు దన్నుగా మారాయి.దీంతో బలగాలు గత కొన్ని నెలలుగా అడవంతా జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టులు ఎదురుపడితే చాలు విగతజీవులుగా మారిపోతున్నారు. వాస్తవానికి గత కొన్ని సంవత్సరాలగా నక్సల్స్ ఉద్యమంలోకి కొత్తగా రిక్రూట్‌మెంట్లు జరగడం లేదు. ఒకప్పుడు యువతను పెద్దగా ఆకర్షించిన ఈ ఉద్యమం ఇప్పుడు ఆ స్థాయిలో వారిని ఆకట్టుకోలేకపోతోంది. మరోవైపు అభివృద్ధి ఫలాలు తెచ్చిన మార్పు ఫలితంగా యువకులు ఎక్కువ మంది చదువులు, ఉద్యోగాలవైపు మొగ్గు చూపుతున్నారు.అంతేకాదు అయిదు దశాబ్దాల ఉద్యమంలో సాధించింది ఏమీ లేదని, వేలాది మంది బందూకులకు బలిగావడం ఒక్కటే మిగిలిందని వారికీ అర్థమవుతోంది. దళంలో ఉన్న కీలక నేతల్లో చాలామంది వయోభారానికి తోడు అనారోగ్యాల బారిన పడ్డంతో జనజీవన స్రవంతిలో కలవడానికి మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా అన్ని సాయుధ పోరాటాలలాగే ఈ ఉద్యమం కూడా రోజురోజుకు చిక్కి శల్యమవుతోంది. కనుమరుగు కావడం ఎంతో దూరంలో లేదనిపిస్తోంది.

# ట్రావెల్స్ బస్సు బోల్తా..యువతి మృతి




రాజమండ్రి సమీపంలో కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుప్రమాదానికి గురయింది. ఘటనలో వైజాగ్ కి చెందిన యువతి మృతి చెందింది. 18 మందికి గాయాలుఅయ్యాయి. గామున్ బ్రిడ్జి రహదారిపై కాతేరు వద్ద కావేరి ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. వైజాగ్ నుండి హైదరాబాద్ వెళుతుండగా అర్ధరాత్రి రాజమండ్రి సమీపంలో జరిగిన దుర్ఘటన జరిగింది. క్షతగాత్రులు రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు.

# జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో 13 అంశాలకు కమిటీ ఆమోదం





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**జనవరి 23: నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 7వ స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం లో జరిగింది. కమిటీ సమావేశంలో 10అంశాలు, మూడు టేబుల్ ఐటమ్ లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు.

ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ... కార్పొరేటర్లు, అధికారులు సమన్వయంతో నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించాలని మేయర్ కోరారు.

ఈ సమావేశంలో కమిషనర్ ఇలంబర్తి, స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, ఫాహెద్ బిన్ అబ్దుల్ సమద్ బిన్ అబ్దత్, పొడవు అర్చన, మహమ్మద్ నజీర్ ఉద్దీన్, గౌస్ ఉద్దీన్ మహమ్మద్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబీహా బేగం, ఆవుల రవీందర్ రెడ్డి, చింతల విజయ్ శాంతి, కంది శైలజ, అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, చంద్రకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, సుభద్రాదేవి, సరోజ, పంకజ, యాదగిరి రావు, రఘు ప్రసాద్, ఈ.ఎన్.సి భాస్కర్ రెడ్డి, సీ.ఈ కోటేశ్వరరావు, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, రవికిరణ్, వెంకన్న, ఉపేందర్ రెడ్డి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు

గుల్మొహర్ పార్కు జంక్షన్ నుండి వయ తారా నగర్ మీదుగా బి.హెచ్.ఇ.ఎల్ జంక్షన్ వరకు మరియు రైల్వే క్రాసింగ్ లింగంపల్లి నుండి 1100 మీటర్ల పొడవు రోడ్డు విద్యాణికేతన్ స్కూల్ నుండి గల్మోహర్ జంక్షన్ వరకు 30 మీటర్లు, 36 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ 227 ఆస్తుల సేకరణకు ప్రభుత్వ అనుమతి కోసం కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నేషనల్ హైవే 44 పైనా ఆరు లేన్ల గ్రేడ్ సపరేటర్ కు డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎక్స్ ప్రెస్ వే గా నామకరణం చేయుటకు కమిషనర్ యాక్షన్ తీసుకొనుటకు ప్రభుత్వం కార్పొరేషన్ కు సిఫార్సు ను కమిటీ ఆమోదం.

కేబీఆర్ పార్కు పరిసర ఎంట్రన్స్ పాయింట్స్ వద్ద ఫైబర్ మరియు సిమెంట్ కుండి లతో పూల మొక్కల తో గ్రీనరీ కోసం సి.ఎస్.ఆర్ పద్ధతిన ఏర్పాటు చేసి నిర్వహించుటకు మెస్సర్స్ క్రియేటివ్ థాట్స్ మీడియా హైదరాబాద్ వారికి మూడేళ్ల పాటు నిర్వహించుటకు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం.

చార్మినార్, ఖైరతాబాద్, కూకట్ పల్లి, శేరిలింగంపల్లి జోన్లలో 2025 సంవత్సరానికి గాను ఆరు డి-సిల్టింగ్ పనుల కోసం రూ. మొత్తం 2231.75 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న 6 డి సిల్టింగ్ పనులలో చార్మినార్ జోన్ లలో 1233 లక్షల తో 3 పనులు చార్మినార్ జోన్ లో, ఖైరతాబాద్ జోన్ లో 379..15 లక్షల వ్యయం తో అదేవిధంగా కూకట్ పల్లి జోన్ లో 315. లక్షలు శేరిలింగంపల్లి జోన్ లో 305 లక్షల వ్యయంతో చేపట్టేందుకు పరిపాలన అనుమతి తో పాటు టెండర్ పిలువడానికి ఆలస్య నివారణకు రాటిఫికేషన్ కమిటీ ఆమోదం.

చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లలో 2025 సంవత్సరానికి గాను మూడు డి-సిల్టింగ్ పనుల కోసం రూ. 697.85 లక్షల లలో ఒక పని చార్మినార్ జోన్ లో 229. 95 లక్షలు ఖైరతాబాద్ జోన్ లో 264.30 లక్షలు సికింద్రబాద్ జోన్ లో 203.60 లక్షల చేపట్టే దిసిల్టింగ్ పనులకు పరిపాలన అనుమతితో పాటు ఈ ప్రైక్రూర్మెంట్ ద్వారా టెండర్ వేయుటకు కమిటీ ఆమోదం.

(ఎ) గతంలో సి.ఆర్.ఎం.పి ఫేజ్ -1 కింద చేపట్టిన పనులకు కొనసాగింపుగా సి.ఆర్.ఎం.పి ఫేజ్-2 కింద 744.22 కిలోమీటర్ల రోడ్డు నిర్వహణ కోసం జోన్ వైస్ ప్యాకేజీలతో 2025 నుండి 2030 కాలానికి ఐదు సంవత్సరాల పాటు రూ. 2491 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన పనులు చేపట్టడానికి గతంలో ఉన్న టెర్మ్స్ అండ్ కండిషన్ ప్రకారంగా బడ్జెట్ కేటాయింపు కోరుట.

(లేదా)

(బి) సి.ఆర్.ఎం.పి ఫేజ్-2 కింద 2025-30 ఐదు సంవత్సరాల కాలానికి రూ. 3828 కోట్ల అంచనా వ్యయంతో 1142.54 కిలోమీటర్ల కొత్త రోడ్ల అభివృద్ధి కోసం పరిపాలన అనుమతితో పాటు టెండర్ ప్రాసెస్ చేయుటకు కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వానికి సిఫార్సు చేయుటకు కమిటీ ఆమోదం.

లాలాపేట్ ఫ్లైఓవర్ నుండి మౌలాలి ఫ్లైఓవర్ వరకు 100 ఫీట్ల రోడ్డు విస్తరణ కొరకు మంజూరైన రూ.3 కోట్లకు అదనంగా అయిన రూ.1.30 కోట్లకు రివైజ్డ్ పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదం.

హైదరాబాద్ ఇన్నోవేటివ్ ట్రాన్స్ఫర్మేటివ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ) కింద ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణాలకు 7032 కోట్ల వ్యయంతో చేపట్టే పనుల కోసం ప్రభుత్వ ఆమోదం కోసం సిఫార్సు కు కమిటీ ఆమోదం అందులో

(ఎ)ప్యాకేజీ 1 ద్వారా జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ జంక్షన్ కేబీఆర్ పార్కు ఎంట్రెన్స్ జంక్షన్ మరియు ముగ్దా జంక్షన్ వద్ద స్టీల్ ఫ్లైఓవర్ మరియు అండర్ పాస్ నిర్మాణానికి రూ. 580 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టడానికి ప్రతిపాదించడమైనది.

(బి) రోడ్ నెం.45 జంక్షన్ ఫిల్మం నగర్ జంక్షన్, మహారాజా అగ్రసేన్ జంక్షన్ మరియు క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద స్టీల్ ఫ్లైఓవర్ మరియు అండర్ పాస్ నిర్మాణాల కోసం రూ. 510 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించబడింది.

(సి) హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ. 5942 కోట్ల వ్యయంతో 23 పనులు చేపట్టడానికి ప్రతిపాదించబడింది. మంజూరైన 4305 కోట్లను అదిగమించి సవరణ వ్యయాన్ని మంజూరు చేయడమైనది.

(డి) హెచ్-సిటీ ప్రాజెక్టు లో జీహెచ్ఎంసీకి అవసరమైన వ్యయాన్ని ప్రతి ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నిధుల నుండి ఖర్చు చేయబడుతుంది.

నల్గొండ ఎక్స్ రోడ్ నుండి సైదాబాద్ వయా ఐ.ఎస్ సదన్ మీదుగా ఓవైసీ వరకు సమగ్ర అభివృద్ధి కోసం రూ. 620 కోట్ల అంచనా వ్యయం నకు రాటిఫికేషన్ కోరుటకు కమిటీ ఆమోదం.

నారాయణగూడలో ఓల్డ్ మున్సిపల్ మార్కెట్ స్థలంలో నిర్మించిన మోడల్ మార్కెట్ భవన నిర్మాణంలో చేసిన మార్పులకు కమిటీ ఆమోదం.

టేబుల్ ఐటమ్స్

ఎం.జె మార్కెట్ నుంచి భూలక్ష్మి దేవాలయం (ముస్లిం జంగ్ బ్రిడ్జి) వయా మాలకుంట బేగం బజార్ రోడ్డు వరకు 30 మీటర్ల వెడల్పుతో అభివృద్ధి చేయుటకు కమిటీ ఆమోదం.

ఎస్.ఆర్.డి.పి కింద గచ్చిబౌలి జంక్షన్ వద్ద రెండవ లెవల్ వద్ద కొండాపూర్ వైపు, ఓ.ఆర్.ఆర్ వైపు ఆరు లేన్ల టూ వే ఫ్లైఓవర్ నిర్మాణం మరియు శిల్పా లే అవుట్ నుండి గ్యాస్ కంపెనీ మీదుగా గచ్చిబౌలి జంక్షన్ వరకు 120 అడుగుల వెడల్పు రహదారి ఏర్పాటుకు ఎలివేటెడ్ స్ట్రక్చర్ పద్ధతిలో ఇంజనీరింగ్ ప్రొక్యూర్ మెంట్ అండ్ కన్స్ట్రక్షన్ కింద మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రాజెక్ట్ అమలుకు రీవైజ్డ్ అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ కు కమిటీ ఆమోదం.

రోడ్ డెవలప్మెంట్ ప్లాన్ కింద ప్రతిపాదించిన గోషామహల్ పోలీస్ గ్రౌండ్ వద్ద అప్రోచ్ రోడ్ నుండి ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వరకు 9.0 మీటర్లు, 12.0 మీటర్లు, 18.0 మీటర్ల విస్తరణతో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి కమిటీ ఆమోదం.


# సిరిసిల్ల నేతన్నలకు బంపర్ ఆఫర్

**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:జనవరి 23,** వస్త్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సిరిసిల్ల నేతన్నకు రాష్ట్ర ప్రభుత్వం చేయుతనిచ్చింది. త్వరలో మహిళా గ్రూపులకు అందజేసే చీరల ఆర్డర్స్ సిరిసిల్ల నేతన్నకు సర్కార్ ఇచ్చింది. సాంచల చప్పుడుతో నేతన్నలు బిజీగా మారుతున్నారుసిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి నేతన్న బతుకు పై భరోసా కల్పించే చర్యలు ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు అందించే యూనిఫామ్ చీరల ఆర్డర్స్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అందజేశారు.ఇందిరా క్రాంతి మహిళా శక్తి చీరల పథకంలో భాగంగా ఒకే రంగు చీరల ఆర్డర్స్ 4.24 కోట్ల మిటర్లు అందజేసింది. ఈ చీరలను ఈ ఏప్రిల్ 30 వ తేదీలోగా సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేసిందని టెస్కో జీఎం అశోక్ రావు తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మార్కెట్ తో పోటీపడి స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారుప్రభుత్వ, ప్రైవేట్ ఆర్డర్స్ తయారు చేసేలా యంత్రాలు ఆధునీకరించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రూ. 500 కోట్ల బకాయిలు విడుదల చేసిందని తెలిపారు. ఆధునిక, నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసేలా సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఇప్పటికే స్కూల్ యూనిఫాం మరమగ్గాల సంఘాలకు 65.67 లక్షల మీటర్లు ఆర్డర్స్ ఇచ్చామని వెల్లడించారుఆర్డర్స్ అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ సెక్రటరీకి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్డర్స్ కాఫీ అందుకునే కార్యక్రమంలో హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సాగర్, టెస్కో ఏడీ సందీప్ జోషి తదితరులు పాల్గొన్నారుబతుకమ్మ చీరలు రద్దుతో నేత కార్మికులు ఆర్థిక ఇబ్బందుల పాలయ్యారు. నేసిన గుడ్డకు గిరాకీ లేక, చేతినిండా పని దొరక్క నేత కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏడాది కాలంలో 30 మందికి పైగా ఆత్మహత్య చేసుకున్నారు. సంక్రాంతి కి రెండు నెలల ముందు తమిళనాడు ప్రభుత్వం పొంగల్ చీరల ఆర్డర్ తో నేత కార్మికులకు కాస్త ఊరట లభించింది. ప్రస్తుతం మహిళా గ్రూపులకు పంపిణీ చేసే చీరల ఆర్డర్ రావడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆర్డర్లు అన్ని సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకే ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పోచంపల్లి చీర.. రెండు డిజైన్లు

ప్రపంచవ్యాప్తంగా మగువలు మెచ్చే పట్టు చీరలకు ప్రసిద్ధి పోచంపల్లి. చేనేత కార్మికుల నైపుణ్యానికి ప్రతీక ఇక్కడి ఈ చీరలు. సృజనాత్మకత, నూతన డిజైన్లతో వస్త్రాల తయారీ ఇక్కడి చేనేత కార్మికుల అద్భుత కళారూపానికి నిదర్శనం. రెండు వైపులా వేర్వేరు డిజైన్లు, వేర్వేరు రంగులు కలిగిన ఇక్కత్పట్టు చీరను నేసి తెలంగాణ చేనేత ఘనతను ఓ కళాకారుడు ఔరా అనిపించాడు.ఇక్కడి చేనేత కార్మికుల అద్భుత కళారూపాలు ఖండాంతర ఖ్యాతిని సాధించాయి. ఈ ప్రాంతంలోని నేతన్నలు ఎన్నో చేనేత పురస్కారాలను అందుకున్నారు. తాజాగా ఓ యువ చేనేత కళాకారుడు రెండు వైపులా వేర్వేరు డిజైన్లు, వేర్వేరు రంగులు కలిగిన ఇక్కత్పట్టు చీరను సృష్టించాడు. యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లికి చెందిన సాయిని భరత్ అనే యువ చేనేత కళాకారుడు అద్భుత కళ రూపాలను రూపొందిస్తున్నాడు. ఎంటెక్ చేసిన సాయిని భరత్ కు చేనేత పై ఎంతో మక్కువ. అంది వస్తున్న టెక్నాలజీ సహాయంతో చేనేత రంగంలో అద్భుతాలు సృష్టించాలని ప్రయత్నించాడు. ఇందులో భాగంగానే కొన్నేళ్ల క్రితం భరత్ మొదటి సారిగా రెండు వేర్వేరు రంగులు, డిజైన్లు కలిగిన ఇక్కత్ దుపట్టాను మగ్గంపై తయారు చేశారు. ఎంతో కళాత్మకంగా దుపట్టాను రూపొందించి నందుకు గాను 2018లో కేంద్ర ప్రభుత్వం నుంచి నేషనల్ మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. అదే స్ఫూర్తితో ఇక్కత్ కీర్తిని ఖండాంతరం చేయాలని రెండున్నర ఏళ్లు కష్టపడి, ఎంతో సృజనాత్మకంగా ఆలోచించి ఒక చీరకు వేర్వేరు డిజైన్లు, రంగులు వచ్చేలా అభివృద్ధి చేశారు.అనంతరం టై అండ్ డై డిజైనింగ్, మగ్గంతో పాటు వీవింగ్లో సైతం ప్రత్యేకమైన పరిజ్ఞానాన్ని వినియోగించి 15 రోజులు మగ్గంపై నేసి రెండు వైపులా వేర్వేరు డిజైన్లు, రంగులు కలిగిన ఉల్టా లేని పట్టు చీరను తయారు చేశారు. దీంతోపాటు కొత్త డిజైన్లతో 3 శాంపిల్ ఇక్కత్ పట్టుచీరలను రూపొందించారు. వీటికి పేటెంట్ కోసం భరత్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కత్లో సాధ్యం కాని ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి.. పరిశ్రమకు కొత్త ఇమేజ్ తీసుకొస్తున్న భరత్ ప్రతిభను కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులు, స్థానికులు ప్రశంసిస్తున్నారు. పట్టుచీరలే కాకుండా భవిష్యత్తులో ఫర్నిషింగ్ వస్త్రాలనూ రూపొందించనున్నట్లు భరత్

# రెండో రోజు కొనసాగిన వార్డు సభలు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 23:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాలు అమలులో భాగంగా గురువారం మందమర్రి మున్సిపాలిటీలో రెండో రోజు వార్డు సభలో కొనసాగాయి. 23వ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వివేక్ వెంకటస్వామి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందచేయటమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. ప్రజల కోసమే పని చేస్తూ ప్రజల వద్దకి పాలనందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, 23 వవార్డ్ ఆఫీసర్ నికత్ షరీన్ , వసంత్, మెప్మా రిసోర్స్ పర్సన్స్ బాగ్యలక్ష్మి, సరస్వతి 23వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బత్తుల రమేష్, నాయకులు దుర్గం ప్రభాకర్, ఎర్ర రాజు, జక్కని సత్యం, దాసరి శ్రావణ్ కుమార్, సారయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాల్లో మంత్రులకు నిరసనగా సెగ

**కరీంనగర్ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 23, తెలంగాణలో నిర్వహిస్తోన్న గ్రామ సభలు నిరసనలకు వేదికగా మారాయి. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం భారీగా దరఖాస్తులు సమర్పిస్తున్నారు. గతంలో ఇచ్చిన దరఖాస్తుల సంగతేంటని ప్రశ్నిస్తూ స్థానిక సమస్యలపై మండిపడుతున్నాయి. మంత్రులకు సైతం నిరసన సెగ తగిలింది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు నిరసన ఆందోళనలకు వేదికలుగా మారుతున్నాయి.

రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ల కోసం భారీగా దరఖాస్తులు సమర్పిస్తూనే ఇదివరకు ఇచ్చిన దరఖాస్తుల సంగతేంటని ప్రశ్నిస్తూ స్థానిక సమస్యలపై ఏకరువు పెడుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ లకు నిరసన సెగ తగిలింది.నిరుపేదల నిరసన ఆందోళన మధ్య ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు జరుగుతున్నాయి. కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక జాబితా ఆమోదానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సభలు దరఖాస్తుల స్వీకరణ, నిరసన ఆందోళనకు వేదికలుగా మారాయి. ఏళ్ళ తరబడి రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం ప్రాథమికంగా తయారు చేసిన జాబితాలో పేర్లు లేకపోయేసరికి అర్హులైన నిరుపేదలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ అధికారులను పాలకులను నిలదీస్తున్నారు. ఇది వరకు ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయి... సమగ్ర కులగణన సర్వే ద్వారా తేల్చింది ఏంటి అని ప్రశ్నిస్తున్నారు. మళ్ళీ ఎందుకు దరఖాస్తులు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరసన ఆందోళనలతో చాలా గ్రామాల్లో ప్రభుత్వం ప్రాథమికంగా తయారు చేసిన జాబితాను ప్రకటించకుండా అర్హులైన నిరుపేదలందరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తామని అధికారులు పాలకులు ప్రకటించి తప్పించుకుంటున్నారు.ప్రజాపాలన గ్రామ సభలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు నిరసన సెగ తగిలింది. ఉమ్మడి జిల్లాలో సుడిగాలి పర్యటనతో నాలుగు గ్రామ సభలో పాల్గొన్నారు. మానకొండూర్ నియోజకవర్గం రేణికుంట, చొప్పదండి నియోజకవర్గం నారాయణపూర్, వేములవాడ నియోజకవర్గం రుద్రంగి, ధర్మపురి నియోజకవర్గం జైన గ్రామసభలో పాల్గొన్న మంత్రులకు నారాయణపూర్ రిజర్వాయర్ నిర్వాసితులు నిరసన సెగ తగిలించారు. రిజర్వాయర్ తో తమ కొంపలు ముంచొద్దని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో రిజర్వాయర్ నుంచి ఇళ్లలోకి నీళ్లు చేరి నిద్రలేని రాత్రి గడపవలసి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు.

మరికొందరు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇంకా ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకోవాలని నిలదీశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతుండగా ఆందోళనతో అడ్డుతగిలారు. దీంతో మాజీ సర్పంచ్ నజీర్ హుస్సేన్ ను పోలీసులు అరెస్టు చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వారిని సముదాయించి రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ళు నిరంతర ప్రక్రియ అని నిరుపేదలందరికీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.గత పాలకుల నిర్లక్ష్యం వల్లే నిరుపేదలకు పదేళ్లుగా రేషన్ కార్డులు అందలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. 10 ఏళ్ళలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. రేషన్ కార్డుల కోసం ఇప్పటికీ 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు అర్హులైన పేదలను అందరికీ రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం త్వరలో ఇవ్వబోతున్నామని ప్రకటించారు. ప్రస్తుతం 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని అవి యధావిధిగా పని చేస్తాయని, పాత కార్డులను తొలగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు నిరంతర ప్రక్రియని తెలిపారు. ఇదివరకు దరఖాస్తు చేసుకోని వారు మాత్రమే ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతంలో ప్రజావాణి, ప్రజాపాలన, మీసేవ లో దరఖాస్తు చేసుకున్న వారికి కుల గణనలో రేషన్ కార్డు లేదని తెలిపిన వారిలో అర్హులను గుర్తించి రేషన్ కార్డులు అందజేస్తామన్నారు.నాలుగు పథకాలు అమలు చేస్తున్న నేపథ్యంలో కొందరు ఓర్వలేక ప్రజల్ని రెచ్చగొడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. పదేళ్ళు ఏ పని చేయలేని వారు, ఇప్పుడు జాబితాలో పేర్లు లేవని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని చెప్పినా నమ్మకండి...ఎవ్వరు ఆందోళన చెందవద్దని మంత్రి పొన్నం కోరారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామన్నారు.గ్రామసభల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రాజెక్టుల బాటపట్టారు. నిర్మాణంలో ఉన్న నారాయణపూర్, కలికోట సూరమ్మ రిజర్వాయర్లను సందర్శించారు. స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం భూ సేకరణ పని పూర్తి కావాల్సి ఉందని అందుకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. కలికోట సూరమ్మ రిజర్వాయర్ లో వచ్చే వర్షాకాలంలో నీటిని నిలువ చేసేలా కృషి చేస్తామని మంత్రులు తెలిపారు. అదేవిధంగా ఏడాదిలోగా నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి నామమాత్రం ప్రయోజనం చేకూర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం జరిగేలా చూస్తుందన్నారు. నారాయణపూర్, కలికోట సూరమ్మ రిజర్వాయర్ లకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఏడాదిలో పూర్తి చేయిస్తామన్నారుముంపుబాధితులకు పూర్తిస్థాయిలో న్యాయంచేస్తామనిహామీ ఇచ్చారు.

# పరిశీలనలో అరకు ఏయిర్ పోర్టు ఏర్పాటు

విశాఖపట్నం అరకులో ఎయిర్పోర్ట్ ఏర్పాటు ప్రతిపాదన పరిశీలనలో ఉందని అరకు ఎంపీ తనూజా రాణి అన్నారు.అరకులో పాస్పోర్ట్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు గిరిజన ప్రాంతం గణనీయంగా అభివృద్ధి చెందు తుం దని వివరించారు గతంలో సింగిల్ లైన్ రోడ్డు ఇప్పుడు నాలుగు లైన్లు గా మారిందని అన్నారు అలాగే సింగిల్ లైన్ రైల్వే ట్రాక్ డబుల్ ట్రాక్ గా మారుతోందని గుర్తు చేశారు ఇప్పుడు పాస్పోర్ట్ సేవా కేంద్రం వచ్చింది అలాగే త్వరలో ఎయిర్పో ర్ట్ కూడా వస్తుందని అన్నారు.ఈ విష యంపై ఇప్పటికే సివిల్ ఏవి యేషన్ మంత్రిత్వ శాఖకి ప్రతిపా దన తీసుకు వెళ్లినట్టు చెప్పారు కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాల సహకా రంతో అరకులో ఎయిర్ పోర్ట్ త్వరితగతిన వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# సినిమా





## సైలెంట్‌గా హిట్‌లు కొట్టేస్తున్న భామ!



సినిమా పరిశ్రమలో నేషనల్ క్రష్, ప్రజలకు పరిచమైన యువ నటి రష్మికా మందన్న . ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఒక స్టార్‌గా మారింది. 28 సంవత్సరాల వయస్సులోనే ఈ యువ నటి తన కెరీర్‌లో ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాలు ఇచ్చి అగ్రస్థానంలో నిలిచింది. 2016లో కిరాక్ పార్టీ సినిమాతో తన కెరీర్ ప్రారంభించిన రష్మిక.. ఆ తర్వాత తెలుగు, తమిళం, హిందీ భాషల్లో చేసిన సినిమాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. రష్మికా మందన్న .. తెలుగు సినిమా పరిశ్రమలో సరిలేరు నీకెవ్వరు, డియర్ కామ్రేడ్, భీష్మ, సీత రామం వంటి సూపర్ హిట్ చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే 2021లో పుష్ప: ది రైజ్ సినిమాతో ఆమె కెరీర్‌లో అద్భుతమైన మలుపు వచ్చింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్‌తో జోడీగా నటించిన రష్మికా.. తెలుగు సినిమా ప్రేక్షకులను మాయచేసింది. పుష్ప: ది రూల్ చిత్రంతో ఈ ట్రెండ్ ఇంకా కొనసాగుతుంది. ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 1800 కోట్ల రూపాయలను కలెక్ట్ చేసి సూపర్ హిట్‌గా నిలిచింది. హిందీ సినిమాల్లో కూడా రష్మికా తన ప్రతిభను చాటుతోంది. 2022లో గుడ్‌బై అనే చిత్రం ద్వారా బాలీవుడ్ లో అడుగుపెట్టిన ఆమె.. 2023లో యానిమల్ సినిమాలో రణబీర్ కపూర్‌తో కలిసి నటించి మరింత గుర్తింపు పొందింది. ఈ నేషనల్ క్రష్ 2025లో మరిన్ని భారీ ప్రాజెక్టులతో అభిమానులను అలరించడానికి సిద్ధమవుతోంది. రష్మికా వ్యక్తిగతంగా కూడా ఎంతో ఆసక్తికరమైన జీవితం గడుపుతోంది. ఇటీవల ఆమె కోస్మోపాలిటన్ పత్రికతో చేసిన సంభాషణలో ఆమె తన జీవితాన్ని "సువర్ణ కాలం"గా అభివర్ణించింది. ఈ కాలంలో ఆమె అనేక విజయాలు సాధించి, తన పని, వ్యక్తిగత జీవితాన్ని సాఫీగా చేసుకుంటోంది. "పుష్ప 2" చిత్రం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన తర్వాత.. రష్మికా 2025లో అనేక కొత్త చిత్రాలతో మరింత విజయాలను అందుకోవాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు.

## మనసులో మాట చెప్పిన జాన్వీ



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ప్రస్తుతం తెలుగులో సినిమాలు చేస్తూ బిజీగా మారుతుంది. ఇటీవలే దేవర సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమాకు కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది ఈ చిన్నది. అలాగే ఇప్పుడు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న సినిమాలోనూ జాన్వీ కపూర్ హీరోయిన్ గా చేస్తుంది. బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలవ్వనుంది. అటు బాలీవుడ్ లో ఇటు టాలీవుడ్ లో సినిమాలు చేస్తూ బిజీగా ఉంది జాన్వీ. తాజాగా జాన్వీ చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో తెగ వైరల్ అవుతున్నాయి. పెళ్లి చేసుకోని సెటిల్ అవ్వాలనుకుంటున్నట్టు తెలిపింది జాన్వీ.జాన్వీ కపూర్‌కి తిరుపతి అంటే ప్రత్యేక అభిమానం ఉన్న విషయం తెలిసిందే. ఈ విషయాన్నిఆమె ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నారు. ఇప్పటికే తిరుపతికి పలుసార్లు వచ్చింది ఈ ముద్దుగుమ్మ. అంతేకాదు తిరుపతిలో పెళ్లి చేసుకోవాలని ఉందని తన కోరికను కూడా తెలిపింది ఈ బ్యూటీ. తాజాగా జాన్వీ మాట్లాడుతూ.. తిరుపతిలోనే సెటిల్ అవ్వాలని ఉందని తెలిపింది. పెళ్లి తర్వాత నటనకు స్వస్తి చెప్పాలనే ఆలోచనలో కూడా ఉన్న అని చెప్పుకొచ్చింది జాన్వీ. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తాజాగా కరణ్ జోహార్ షోలో జాన్వీ మాట్లాడుతూ.. 'పెళ్లి చేసుకుని తిరుమలలో భర్తతో సెటిల్ అవ్వాలి. ముగ్గురు పిల్లతో హాయిగా గడపాలి, ప్రతిరోజూ అరటి ఆకులో అన్నం తినాలి, గోవిందా గోవిందా అని స్మరించుకోవాలి. అలాగే మణిరత్నం సినిమాల సంగీతం వింటూ కూర్చోవాలి' అని జాన్వీ కపూర్ తెలిపింది.

## అందరూ చూడాల్సిన మూవీ 'సినిమా బండి'



తన తొలి సినిమా 'సినిమా బండి'తో ప్రశంసలు అందుకున్న దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల ఇప్పుడు తన రెం డో చిత్రం 'పరదా'తో వస్తున్నారు. ఫ్యామిలీ మ్యాన్ సిరీస్‌తో పాపులరైన రాజ్, డికె ఈ చిత్రానికి మద్దతు ఇస్తున్నా రు. శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఆనంద మీడియా బ్యానర్ పై ఈ సినిమాని నిర్మిస్తున్నారు. మోస్ట్ టాలెంటెడ్ అనుపమ పరమేశ్వరన్, దర్శ న రాజేంద్రన్, ప్రముఖ నటి సంగీత వంటి అద్భుతమైన తారాగణం ఈ సినిమాలో వుంది. ఫస్ట్ లుక్ పోస్టర్, కాన్సె ప్ట్ వీడియోకు అద్భుతమైన స్పందన వచ్చింది. బుధవారం దుల్కర్ సల్మాన్ ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ టీజ ర్ కథానాయిక సుబ్బు పాత్రను అనుపమ పరమేశ్వరన్ వాయిస్ ఓవర్ ద్వారా పరిచయం చేస్తుంది. కథకుడి ప్రకారం, సుబ్బు చాలా దూరం ప్రయాణించి తన జీవితా న్ని ముగించడానికి 70 లక్షలు చెల్లిస్తుంది.ఆ తర్వాత సు బ్బు, దర్శన రాజేంద్రన్, సంగీత పోషించిన మరో ఇద్దరు ప్రధాన పాత్రలతో కలిసి సాహసోపేతమైన యాత్రకు బయలుదేరడం ఆసక్తిగా వుంది. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ "నేను ఇండస్ట్రీకి వచ్చి పదేళ్ళు అవుతుంది. ఈ పదేళ్ళలో నా మోస్ట్ ఫేవరేట్ ఫిలిం పరదా, మోస్ట్ ఫేవరేట్ క్యారెక్టర్ సుబ్బు. ఈ సినిమా అందరూ ఇష్టపడి చేసిన సినిమా, అందరూ ఫ్యామిలీతో చూడాల్సిన సినిమా"అని అన్నారు. నిర్మాత విజయ్ మాట్లాడుతూ "ప్రవీణ్ ఈ సినిమాకి ప్రాణం పెట్టి పనిచేశాడు. చాలా పెద్ద డైరెక్టర్ అవుతాడు. ఈ సినిమాను మలయాళం స్టార్ దుల్కర్ తీసుకున్నారు.

## తమన్ ఎమోషనల్ కామెంట్స్



బాలకృష్ణ హీరోగా నటించిన డాకు మహారాజ్ సినిమా ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. బాబీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రగ్యాజైస్వాల్, శ్రద్ధా శ్రీనాద్ హీరోయిన్స్ గా నటించారు. అలాగే ఈ సినిమాలో యాక్షన్ సీన్స్ హైలెట్ అనే చెప్పాలి. అలాగే ఈ సినిమాకు తమన్ అందించిన సంగీతం సినిమా విజయంలో కీ రోల్ ప్లే చేసింది. ఈ సినిమా విజయం సాధించడంతో తాజాగా సక్సెస్ ఈవెంట్ ను ఏర్పాటు చేశారు. ఈ ఈవెంట్ లో తమన్ మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేశారు.సంగీత దర్శకుడు థమన్ మాట్లాడుతూ, "బాలకృష్ణ గారి సినిమాకి సంగీతం చేయడం అనేది నాకు టెన్త్ ఎగ్జామ్ లా ఉంటుంది. ప్రతి సినిమాకి ఇంకా గొప్ప సంగీతం అందించాలనే కసితో పనిచేస్తున్నాను. బాలకృష్ణ గారిని చూస్తేనే ఎనర్జీ వచ్చేస్తుంది. ఆ ఉత్సాహంతోనే సంగీతం చేస్తున్నాను. బాలకృష్ణ గారు నాకు తండ్రి లాంటి వారు. నన్నెప్పుడు ఆశీర్వదిస్తూ ఉంటారు. దర్శకుడు బాబీ గారికి సంగీతం మీద మంచి పట్టు ఉంది. ఆయన విజిల్ చేస్తూ పాటను హమ్ చేశారంటే అది హిట్టే. భైరవద్వీపం మా కుటుంబాన్ని ఆదుకున్న సినిమా అని చెప్పారు తమన్. డ్రమ్స్ వాయిస్తూ రోజుకి 30 రూపాయలు తీసుకుంటూ బాలకృష్ణ గారి సినిమాతోనే నా సినీ ప్రయాణం మొదలైంది. అలాంటి నేను ఇప్పుడు బాలకృష్ణ గారి సినిమాలకు సంగీతం అందించడం అదృష్టంగా భావిస్తున్నాను. దర్శకుడు బాబీ ఎంతో కష్టపడ్డారు. ప్రతి సన్నివేశాన్ని ఇంకా గొప్పగా చేయడానికి ప్రయత్నించారు.

## ఐటీ సోదాలపై దిల్ రాజు రియాక్షన్..



హైదరాబాద్ లోని తన ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ దాడులు జరగడంపై నిర్మాత దిల్ రాజు స్పందించారు. 'సోదాలు నా ఒక్కడిపైనే జరగడం లేదు. ఫిల్మ్ ఇండస్ట్రీ మొత్తం జరుగుతున్నాయి' అని అన్నారు. 'సంక్రాంతి వస్తున్నాం'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ప్రొడ్యూసర్ దిల్ రాజుకు ఐటీ అధికారులు షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. నిన్న మంగళవారం ఉదయం నుండి దిల్ రాజు ఇంట్లో , ఆఫీస్ లలో , ఆయన బంధువుల ఇళ్లలో సోదాలు చేయడం మొదలుపెట్టారు. విచారణలో భాగంగా ఆయన భార్య తేజస్వినిని సైతం అధికారులు బ్యాంకుకు తీసుకెళ్లారు. దిల్ రాజు తో పాటు మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతల ఇళ్లపై కూడా ఐటీ రైడ్స్ జరుగుతున్నాయి. ఈరోజు పుష్ప డైరెక్టర్ సుకుమార్ ఇంట్లో కూడా ఐటీ దాడులు జరుగుతున్నాయి. పుష్ప-2 సినిమా భారీ కలెక్షన్ల నేపథ్యంలో మేకర్స్ ఇళ్లపై నిన్నటి నుంచి రైడ్స్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆ చిత్ర డైరెక్టర్ సుకుమార్ ఇంట్లోనూ విస్తృతంగా తనిఖీలు చేసారు. ఇలా రెండు రోజులుగా చిత్రసీమలో ప్రముఖులపై రైడ్స్ జరుగుతుండడం ఆందోళన కలిస్తుంది. అయితే ఈ రైడ్స్ పై దిల్ రాజు స్పందించారు. 'సోదాలు నా ఒక్కడిపైనే జరగడం లేదు. ఫిల్మ్ ఇండస్ట్రీ మొత్తం జరుగుతున్నాయి' అని అన్నారు.

## బాలీవుడ్ సెలబ్రిటీస్‌కు డెత్ త్రెట్..



బాలీవుడ్ లో సెలబ్రెటీలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇప్పటికే సల్మాన్ ఖాన్ ను చంపేందుకు ఓ ముఠా ప్రయత్నిస్తుంది. అలాగే రీసెంట్ గా సైఫ్ అలీ ఖాన్ పై ఓ దుండగుడు కత్తితో దాడి చేయడంతో ఒక్కసారిగా బాలీవుడ్ ఉలిక్కి పడింది. ఇక ఇప్పుడు మరికొంతమంది సెలబ్రెటీలకు చంపుతామని బెదిరింపు కాల్స్.. బాలీవుడ్ లో సెలబ్రెటీలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇప్పటికే సల్మాన్ ఖాన్ ను చంపేందుకు ఓ ముఠా ప్రయత్నిస్తుంది. అలాగే రీసెంట్ గా సైఫ్ అలీ ఖాన్ పై ఓ దుండగుడు కత్తితో దాడి చేయడంతో ఒక్కసారిగా బాలీవుడ్ ఉలిక్కి పడింది. ఇక ఇప్పుడు మరికొంతమంది సెలబ్రెటీలకు చంపుతామని బెదిరింపు కాల్స్, మెయిల్స్ రావడంతో ఒక్కసారిగా అంతా షాక్ అయ్యారు. బాలీవుడ్ సెలబ్రిటీస్‌కు డెత్ త్రెట్, చంపేస్తాం అంటూ పాకిస్తాన్ నుంచి కాల్స్ వచ్చినట్టు తెలుస్తుంది. బాలీవుడ్ సెలబ్రెటీలు కపిల్ శర్మ, రాజ్‌పాల్ యాదవ్, సుగంధ మిశ్రా, రెమో డిసౌజాకు బెదిరింపులు వచ్చాయని తెలుస్తుంది. తమకు ఈమెయిల్స్ వచ్చాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు సెలబ్రెటీలు. ముంబై అంబోలీ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. 8 గంటల్లో రిప్లై ఇవ్వకుంటే చంపేస్తామంటూ బెదిరింపు మెయిల్స్ వచ్చాయని సెలబ్రెటీలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



# క్రీడలు



## ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ విడుదల.. టాప్‌లో బుమ్రా, జడేజా




ఐసీసీ తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా ప్రస్థానం కొనసాగుతోంది. క్రికెట్‌లో సుదీర్ఘమైన ఫార్మాట్‌లో బుమ్రా ప్రపంచ నంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఇదే సమయంలో ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా కూడా అగ్రస్థానంలో ఉన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ బౌలర్ నోమన్ అలీ తన అద్భుతమైన బౌలింగ్ చేసి టాప్ 10 బౌలర్ల జాబితాలోకి ప్రవేశించాడు. బుమ్రా తర్వాత పాట్ కమిన్స్ రెండో స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసో రబడ మూడో స్థానంలో ఉన్నాడు. బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టెస్టు క్రికెట్‌లో ప్రపంచ నంబర్‌వన్ బౌలర్‌గా జస్ప్రీత్ బుమ్రా కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో బుమ్రా అద్భుత ప్రదర్శన చేశాడు. బుమ్రా 5 మ్యాచ్‌ల్లో మొత్తం 32 వికెట్లు పడగొట్టాడు. బుమ్రా మొత్తం రేటింగ్ పాయింట్లు ఇప్పుడు 908. బుమ్రా తర్వాత పాట్ కమిన్స్ 841 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, కగిసో రబడ 837 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో అద్భుతంగా బౌలింగ్ చేసిన పాకిస్థాన్ బౌలర్ నోమన్ అలీకి ప్రమోషన్ లభించింది. ముల్తాన్‌లో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో నోమన్ తన బౌలింగ్‌తో విధ్వంసం సృష్టించి మొత్తం 6 వికెట్లు పడగొట్టాడు. టెస్టు క్రికెట్‌లోని టాప్ 10 బౌలర్ల జాబితాలో నోమన్‌కు చోటు దక్కింది. పాక్ బౌలర్లు ఇప్పుడు మొత్తం 761 రేటింగ్ పాయింట్లను కలిగి ఉన్నాడు. ఇటీవలి కాలంలో నోమన్ సొంతగడ్డపై టెస్టు క్రికెట్‌లో మంచి ప్రదర్శన కనబరిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో బ్యాట్, బాల్ రెండింటిలోనూ మెరుగైన ప్రదర్శన చేయలేకపోయినప్పటికీ రవీంద్ర జడేజా టెస్ట్ క్రికెట్‌లో ప్రపంచ నంబర్ వన్ ఆల్ రౌండర్‌గా కొనసాగుతున్నాడు. తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో జడ్డూకి 400 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. అదే సమయంలో దక్షిణాఫ్రికా స్టార్ ప్లేయర్ మార్కో జాన్సన్ రెండో స్థానంలో ఉన్నాడు. మెహందీ హసన్ 284 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు.

## తొలి మ్యాచ్‌లో హైలైట్స్ ఇవే!



భారత్– ఇంగ్లాండ్ మధ్య జరిగిన తొలి టి20లో అత్యధిక స్కోరు నమోదవుతుందని అంతా భావించారు. జోస్ బట్లర్ నేతృత్వంలో బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టు పూర్తిగా నిరాశాజనక ప్రదర్శన చేసింది. భారీ హిట్టర్లతో కూడిన ఆ జట్టు పరుగులు రాబట్టడంలో సక్సెస్ కాలేదు. టీమిండియా బౌలర్ల అద్భుత ప్రదర్శన ముందు ఇంగ్లిష్ బ్యాటర్లు నిలవలేకపోయారు. బట్లర్ మినహా ఎవరూ తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వలేదు. భారత్ ఇంకా 43 బంతులు మిగిలి ఉండగానే ఇంగ్లాండ్‌ను ఏడు వికెట్ల తేడాతో ఓడించింది. బౌలింగ్, బ్యాటింగ్ తో అదరగొట్టిన భారత్ ఫీల్డింగ్ లోనూ అదరగొట్టింది. రింకు సింగ్, నితీష్ కుమార్ రెడ్డి అద్భుత క్యాచ్‌లతో ఆకట్టుకున్నారు.అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో కవర్స్‌లో బెన్ డకెట్‌ను క్యాచ్ అవుట్ చేశాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన మూడో ఓవర్ ఐదవ బంతికి డకెట్ ఏరియల్ షాట్ ఆడాడు. బంతి కవర్స్ వైపు వెళుతుంది. అక్కడే ఉన్న రింకు సింగ్ వెనక్కి పరిగెత్తి తన రెండు చేతులను ముందుకు చాచి క్యాచ్ తీసుకున్నాడు.రింకు సింగ్ ఈ కష్టమైన క్యాచ్‌ను సులభంగా పట్టుకోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే రింకు డై చేసినట్లు ఏ మాత్రం అనిపించలేదు. దీంతో బెన్ డకెట్ కేవలం 4 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ కు చేరాడు. దీని తర్వాత నితీష్ కుమార్ రెడ్డి అసాధారణ క్యాచ్‌ను అందుకున్నాడు. ఇంగ్లాండ్ టాప్ స్కోరర్ అయిన కెప్టెన్ జోస్ బట్లర్ క్యాచ్‌ను నితీష్ అద్భుతంగా ఒడిసి పట్టుకున్నాడు. అక్షర్ పటేల్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్ రెండవ బంతికి బట్లర్ స్క్వేర్ లెగ్ వైపు ఏరియల్ షాట్ ఆడాడు. అయితే బట్లర్ కు టైమింగ్ కుదరలేదు. స్క్వేర్ లెగ్ బౌండరీ వద్ద ఉన్న నితీష్ రెడ్డి ముందుకు పరిగెత్తి గాల్లోకి దూకి తన రెండు చేతులను ముందుకు చాచి గ్రాస్ కి దగ్గరగా క్యాచ్ తీసుకున్నాడు. అయితే నితీష్ క్యాచ్ పట్టాడో లేదో తెలియక అంపైర్ ఒక్క క్షణం అయోమయంలో పడ్డాడు. దీంతో థర్డ్ అంపైర్ సహాయం తీసుకున్నాడు. రీప్లేలో నితీష్ కుమార్ రెడ్డి క్లీన్ క్యాచ్ పట్టి జోస్ బట్లర్ ఇన్నింగ్స్‌ను ముగించాడని స్పష్టంగా కనిపించింది. కాగా ఆటగాళ్ల ఆల్ రౌండ్ ప్రదర్శన కారణంగా భారత జట్టు తొలి టి20ని 7 వికెట్ల తేడాతో కైవసం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టు మొత్తం 20 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన భారత్ 12.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇప్పుడు ఇరు జట్ల మధ్య సిరీస్‌లో రెండో మ్యాచ్ శనివారం చెన్నైలో జరగనుంది.

## ఇంగ్లండ్‌పై వరుణాస్త్రం!



ఈడెన్ గార్డెన్స్‌లో తొలుత టీమిండియా బౌలర్ వరుణ్ చక్రవర్తి స్పిన్ మాయాజాలానికి తోడు.. బ్యాటర్ అభిషేక్ శర్మ ధనా ధన్ బ్యాటింగ్‌తో చెలరేగడంతో ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టి20లో టీమిండియా ఘన విజయం సాధించింది. తొలుత వరుణ్ చక్రవర్తి(3/23)కి తోడు అర్ష్‌దీప్, హార్దిక్, అక్షర్ రెండేసి వికెట్లతో రాణించడంతో ఇంగ్లండ్ జట్టు 132పరుగులకే ఆలౌటౌటైంది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అభిషేక్ శర్మ(79బీ 34బంతుల్లో 5ఫోర్లు, 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగా ఆడి మ్యాచ్‌ను 12.5ఓవర్లలోనే ముగించారు. టాస్ గెలిచిన భారత్.. తొలుత బౌలింగ్‌కే మొగ్గు చూపింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నమ్మకాన్ని ఏ ఒక్క బౌలర్ వమ్ము చేయలేదు. అర్ష్‌దీప్, హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ వికెట్లు చేజిక్కించుకోవడంలో సఫలమయ్యారు. ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్(68) అర్ధసెంచరీ మినహా.. మిగతా ఏ ఒక్క బ్యాటర్‌నూ క్రీజ్‌లో నిలదొక్కుకునే అవకాశం భారత బౌలర్లు ఇవ్వలేదు. తొలి ఓవర్లోనే ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ డౌకౌట్ అయ్యాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో కీపర్ సంజూ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత కెప్టెన్ జోస్ బట్లర్ మరో ఓపెనర్ బెన్ డకెట్‌కు జతగా క్రీజులోకి వచ్చాడు. కానీ మూడో ఓవర్ ఐదో బంతికి బెన్ డకెట్(4) కూడా పెవిలియన్‌కు చేరాడు. అర్షదీప్ బౌలింగ్ లోనే రింకూ సింగ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం మరో బౌలర్ వరుణ్ చక్రవర్తి తన విశ్వరూపం చూపించాడు. ఎనిమిదో ఓవర్ మూడో బంతికి హ్యారీ బ్రూక్‌ను, ఐదో బంతికి లియామ్ లివింగ్‌స్టోన్‌ను ఔట్ చేసి పెవిలియన్‌కు పంపాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్, హార్దిక్, అక్షర్‌కు రెండేసి, వరుణ్ చక్రవర్తికి మూడు వికెట్లు దక్కాయి. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సంజు(26), అభిషేక్(79) ధనా ధన్ బ్యాటింగ్‌తో మెరిసారు. అభిషేక్ శర్మ కేవలం 20 బంతుల్లోనే అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. కెప్టెన్ సూర్యకుమార్(0) నిరాశపరిచినా.. తిలక్‌వర్మ(19), హార్దిక్(3) మరో వికెట్ కోల్పోకుండా మ్యాచ్‌ను ముగించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్‌కు రెండు, రషీద్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వరుణ్ చక్రవర్తికి లభించగా.. ఐదు టి20ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. రెండో టి20 చెన్నై వేదికగా శనివారం జరగనుంది.

## హిట్‌మ్యాన్‌కు రహానే సపోర్ట్!



ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన టెస్టు సిరీస్‌లో హిట్‌మన్ పూర్తిగా నిరాశపర్చాడు. నిరంతర వైఫల్యం కారణంగా రోహిత్ స్వయంగా చివరి టెస్టులో తప్పుకోవాల్సి వచ్చింది. కోల్పోయిన ఫామ్‌ను తిరిగి తేవడానికి రోహిత్ ఇప్పుడు రంజీ ట్రోఫీలో ఆడుతున్నాడు. దాదాపు 10 ఏళ్ల తర్వాత దేశవాళీ క్రికెట్‌లో భారత కెప్టెన్ ఆడనున్నాడు. అజింక్యా రహానే కెప్టెన్సీలో రోహిత్ ఆడనున్నాడు. రోహిత్ పేలవమైన ఫామ్ గురించి రహానేని పలువురు రిపోర్టర్‌లు ప్రశ్నించగా.. హిట్‌మ్యాన్‌ను ఏం చేయాలో ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదని సమాధానం ఇచ్చాడు. జమ్మూ కాశ్మీర్‌తో మ్యాచ్‌కు ముందు రోహిత్ పేలవమైన ఫామ్ గురించి విలేకరుల సమావేశంలో అజింక్యా రహానేని ఒక ప్రశ్న అడిగారు. దీనిపై రహానే స్పందిస్తూ.. "రోహిత్‌కు ఏం చేయాలో ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. అతను పెద్ద టోర్నీలకు దూరంగా ఉన్నాడు. చూడండి రోహిత్ ఆట మనందరికీ తెలుసు. రోహిత్ స్వభావం మీకు కూడా తెలుసు. రోహిత్, యశస్వి ముంబై డ్రెస్సింగ్ రూమ్‌కి తిరిగి రావడం చాలా సంతోషంగా ఉంది. రోహిత్ ఎప్పుడూ రిలాక్స్‌గా ఉంటాడు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆయన పాత్ర అలాగే ఉంటుంది. రోహిత్ తన ఆటను బాగా అర్థం చేసుకున్నాడు. రోహిత్‌కు ఏం చేయాలో ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. హిట్ మ్యాన్ పెద్ద ఇన్నింగ్స్ ఆడడంలో విజయవంతమైతే రోహిత్ మళ్లీ ఫామ్‌లోకి వస్తాడని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను అని రహానే సమాధానం ఇచ్చాడు.

## టీ20లో గురు శిష్యులదే పైచేయి!



ఇంగ్లండ్ తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో టీమిండియా బోణీ కొట్టింది. భారత విజయానికి ఓపెనర్ అభిషేక్ శర్మ ఎంతగా దోహదపడ్డాడో బౌలర్లు కూడా అంతే సహకారం అందించారు. తొలుత బౌలర్లు ఇంగ్లండ్ జట్టును స్వల్ప స్కోరుకే కుప్పకూల్చగా, ఛేదనలో ఓపెనర్ అభిషేక్ శర్మ అర్ధ సెంచరీతో చెలరేగాడు. 133 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ తరఫున అభిషేక్ శర్మ 34 బంతుల్లో 79 పరుగులతో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు. ఇన్నింగ్స్ లో అభిషేక్ 5 ఫోర్లు, 8 సిక్సర్లతో విలయతాండవం చేశాడు. తద్వారా అభిషేక్ శర్మ తన టీ20 కెరీర్‌లో రెండో అర్ధ సెంచరీని కేవలం 20 బంతుల్లోనే పూర్తి చేసుకున్నాడు. అభిషేక్ కు ఈ అర్ధ సెంచరీ చాలా ప్రత్యేకమనే చెప్పాలి. ఎందుకంటే ఇంగ్లాండ్‌పై టి20లో ఒక భారతీయ బ్యాట్స్‌మన్ చేసిన రెండవ వేగవంతమైన అర్ధ సెంచరీ ఇదే. అభిషేక్ శర్మ కంటే ముందు యువరాజ్ సింగ్ 2007 టి20 ప్రపంచ కప్ సందర్భంగా ఇంగ్లాండ్‌పై వేగవంతమైన అర్ధ సెంచరీ సాధించాడు. యువరాజ్ సింగ్ కేవలం 12 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ జాబితాలో కెఎల్ రాహుల్ పేరు మూడవ స్థానంలో ఉంది. 2018లో కేఎల్ మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్‌పై 27 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు.నిజానికి యువరాజ్ సింగ్ ను అభిషేక్ శర్మ గురువుగా భావిస్తాడు. పంజాబ్‌కు చెందిన ఈ యువ బ్యాట్స్‌మన్‌కు యువరాజ్ సింగ్ కోచ్ గా కూడా వ్యవహరించాడు. దీంతో గురువు తగ్గ శిష్యుడిగా అభిషేక్ ను ప్రశంసిస్తున్నారు. అటు అభిషేక్ ఇన్నింగ్స్ పై యువీ ఆనందం వ్యక్తం చేశాడు. మరోవైపు అభిషేక్ భారీ ఇన్నింగ్స్ ద్వారా యువీని గుర్తు చేశాడని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. టీమిండియా టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకుంది. భారత స్పిన్నర్లను ఎదుర్కొవడంలో ఇంగ్లీష్ బ్యాట్స్‌మెన్లు తేలిపోయారు. స్పిన్నర్ల ధాటికి ఎక్కువసేపు క్రీజులో ఉండలేకపోయారు. కెప్టెన్ బట్లర్ అత్యధకంగా 68 పరుగులు చేశాడు. మిగతా ఏడుగురు బ్యాట్స్‌మెన్లు రెండంకెల స్కోరును కూడా చేరుకోలేకపోయారు. వరుణ్ చక్రవర్తి మూడు వికెట్లు తీసుకోగా, అక్షర్, హార్దిక్, అర్ష్‌దీప్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 12.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది.

# గురుకుల ప్రవేశాలకు ఫిబ్రవరి 1 పొడిగింపు...ఆర్ సి ఓ గోపి చంద్ రాథోడ్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 23 :** తెలంగాణ ఎం జె పి సాధారణ సంక్షేమ గురుకులల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5 వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాలకు నిర్వహించే టీజీ సెట్ 2025 ను ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది.కాగా ఈ ఏడాది కొన్ని మార్పులు చేసింది. ఫిబ్రవరి 1 వరకు గడువు :- డిసెంబర్ 21 నుండి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా 2025 ఫిబ్రవరి 1వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు.వీటితోపాటు 6,7,8 వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో ఫిబ్రవరి 23వ తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. అంతర్జాలంలో టీజీ సెట్, సిజిజి,జిఓవి ఇన్ వెబ్ సైట్ లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఆధార్ కార్డు చరవాణి సంఖ్య ఉంటే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కానీ ఈ ఏడాది నుండి ఆధార్,బోనఫైడ్,ఫోటోతో పాటు కుల,ఆదాయ ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. చరవాణి నెంబరు 040-23391598,94910 63511,040-23328266,040-24734899 ద్వారా ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు.ప్రస్తుతం కావాల్సినవి విద్యార్థి పాస్ పోర్ట్ సైజ్ ఫోటో,ఆధార్,కుల, ఆదాయ,జనన ధ్రువపత్రాలు. నాలుగో తరగతి చదువుతున్న పాఠశాల నుండి బోనఫైడ్ సర్టిఫికెట్.అర్హులు:- గ్రామీణ ప్రాంత వాసులు రూపాయలు 1.5 లక్షలు, పట్టణవాసులు రూపాయలు 2 లక్షల లోపు ఆదాయం కలిగి ఉండాలి.

దరఖాస్తు ఫారం రుసుము 100రూపాయలు చెల్లించి తీసుకోవాలి.గోపీచంద్ రాథోడ్(ఆర్ సి ఓ ):-

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ మంచిర్యాల ఆసిఫాబాద్ ఆదిలాబాద్ జిల్లాలలో బాల బాలికలకు చెందిన 26 గురుకుల పాఠశాలలు ఉన్నాయని తెలిపారు.వీటిలో మొత్తం 2080 సీట్లు ఖాళీగా ఉన్నాయనిపేర్కొన్నారు. బాలికల గురుకులంలో వెయ్యి 40 సీట్లు,బాలుర గురుకులంలో వెయ్యి 40 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నిర్మల్ జిల్లాలోని ముధోల్, సారంగాపూర్,ఖానాపూర్, మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల,లక్షెట్టిపేట, మందమర్రి,బెల్లంపల్లి, ఆశీర్వాద్ జిల్లాలోని ఆసిఫాబాద్,కాగజ్ నగర్, గన్నారం,ఈదుల సావర్గాం, జైనథ్,లలో 13 బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా బాలుర గురుకుల పాఠశాలలు జామ్ గాం,నిర్మల్, ఉట్నూర్,రాచపూర్ మంచిర్యాల జిల్లాలో లక్షెట్టిపేట,గుడిపేట, తాండూర్,చెన్నూర్, ఆసిఫాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్,చిన్నరాసపల్లి, ఆదిలాబాద్,జిల్లాలో బేలా, జైనథ్,నర్సాపూర్ లలో కలిపి 13 గురుకుల పాఠశాలలు ఉన్నాయని వివరించారు.

పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.ఆర్ సి ఓ గోపీచంద్ రాథోడ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పేద విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,ప్రస్తుతం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో కార్పొరేట్ గుర్తు పాఠశాలలకు గురుకులల్లో అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు.ఈ ఏడాది దరఖాస్తు చేసుకోవడం ప్రవేశాలకు పొందేందుకు విధానాన్ని పొందుపరచడం సులువు చేయడం జరిగిందన్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న పేద విద్యార్థులు గడువులోపు దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.

## నిరుపేద కుటుంబాలకు చేయూతను అందించి ఆదుకున్న మంచిర్యాల శాసనసభ్యుడు ప్రేమ్ సాగర్ రావు





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 23 :** మంచిర్యాల నియోజకవర్గంలోని దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన నిరుపేదలు అయిన సుద్దాల రాములు,జిల్లపల్లి శ్రీనివాస్,మర్సుకొల చందు,జుల లక్మయ్య,లు వివిధ కారణాలతో అనారోగ్యం తో మృతి చెందగా ఒక్కో కుటుంబానికి 5,000 వేల రూపాయల చొప్పున 20,000 వేల రూపాల ఆర్థిక సహాయాన్ని మంచిర్యాల శాసనసభ్యుడు ప్రేమ్ సాగర్ రావు ఇవ్వగా ఇట్టి నగదును రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి అందచేశారు.ఈ కార్యక్రమం లో గ్రామ కమిటీ అధ్యక్షులు గొట్ల మహేందర్,%ంఎ% సెల్ అధ్యక్షులు అరెపల్లి రమేష్,జీళ్లపల్లి బానుచందెర్,బల్లికొండ రాజన్న,జంజిరాల రాజు,బుక్యా రవి,లెంకథి శేకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోటో గ్రాఫర్ నూతన కార్యవర్గం ఎన్నిక. ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



**మెదక్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి :-** గత పాలకుల ఉత్తుత్తి హామీలు ఇవ్వం ఆచరణ ఆమలు చేస్తాం మాటలు కాదు చేతలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ జిల్లా నూతన ఫోటో, వీడియో గ్రాఫర్స్ అధ్యక్షుల బాడీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంకు ముఖ్య అతిధిగావిచ్చేశారు.గురువారం రోజున మెదక్ జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆద్వర్యంలో సర్వసభ్య సమావేశం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార%శీ% శ్రీ సాయి బాలాజీ గార్డెన్ లో నిర్వహించారు. ఫోటో కెమెరాను సృష్టించిన డాగురే చిత్రపటానికి పూలమాల, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యస్ కే హుస్సేన్, జిల్లా అధ్యక్షులు కంచి ఆనంద్, ప్రధాన కార్యదర్శి బండ చంద్రశేఖర్, కోశాధికారి కూచన శ్రీధర్ మరియు వారి కార్యవర్గ సభ్యులచే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్ చేత ప్రమాణ స్వీకారం నిర్వహించారు. .

ఈ కార్యక్రమంలో మెదక్ స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో మాటలే తప్ప చేతలు లేవని మేము పనిచేసి చూపిస్తామని ఫోటోగ్రాఫర్ల సంఘానికి స్థలాన్ని కేటాయించడానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు..రాష్ట్ర తెలంగాణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ సంఘం అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ రంగంలో కెమెరా పై అవగాహనకల్పించారు.రాష్ట్రం ఏర్పాటు చేసిన కుటుంబ భరోసా సంఘంలో ప్రతి ఒక్క సభ్యులు చేరలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మాధవరెడ్డి, రాష్ట్ర ముఖ్య సలహాదారులు కేదార్ రెడ్డి, రాష్ట్ర గౌరవ సలహాదారుడు. బూశెట్టి శ్రీధర్. రాష్ట్ర కుటుంబ భరోసా ఇన్చార్జి నాగరాజు. మెదక్ జిల్లా నుండి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి దాసరి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దరిపల్లి సురేష్, నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు కంచి ఆనంద్. ప్రధాన కార్యదర్శి బండ చంద్రశేఖర్. కోశాధికారి .. కూచన శ్రీధర్. వివిధ జిల్లా అధ్యక్షులు. మెదక్ జిల్లాలోని మండలాల అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులు ఫోటో మరియు వీడియో గ్రాఫర్ల సభ్యులు . మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఆడెపు రామకృష్ణ, గౌరవ సలహాదారులు మంద రా%శీ% కిషన్, గౌరవ సలహాదారులు పూల సాయిరాం,ప్రధాన సలహాదారులు బిసికె బసవరాజ్, జిల్లా కార్యవర్గ ఏకైక సభ్యురాలు పడిగే స్వరూప. జి యం మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు నరేష్ లు . సమన్వయకర్త మన్నె శ్రీనివాస్ ,జిల్లా కోఆర్డినేటర్గా గిరి . విగ్నేష్ . చింతల్ రవీందర్, సురేందర్, వంశీ, అఖిల శ్రీనివాస్, శ్రీకాంత్ జిల్లాలోని ఫోటో అయిన వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.



# ఈనెల 26 న సంగారెడ్డి కి మందకృష్ణ మాదిగ

## వెల డప్పులతో బారీ ర్యాలీ ని విజయవంతం చేయండి. ....కోళ్ళ శివ మాదిగ ఎం ఆర్ పి ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉమ్మడి జిల్లా ఇన్చార్జి.



**సంగారెడ్డి జనవరి 23 ప్రజ బలం ప్రతినిధి:** ఎం ఆర్ పి ఎస్ సంగారేడ్డి జిల్లా అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం మైసగళ్ళ బుచ్చేంద్ర మాదిగ ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోళ్ళ శివ మాదిగ ఎం ఆర్ పి ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నేల 26 నా సంగారెడ్డి కి గౌ శ్రీ మందకృష్ణ మాదిగ వస్తున్న సందర్భంగా వెల డప్పులతో బారీ ర్యాలీ ఉంటుంది, జిల్లా లోని ప్రతి మాదిగ పల్లెల్లో నుండీ డప్పుల సంకన వెసుకుని సంగారెడ్డికి తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, కోమ్ము శెఖర్ మాదిగ ఎం ఎస్ ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాట్లాడుతూ విద్యార్థులు,ఉప కులాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు, డప్పోల్ల రమేష్ మాదిగ గారు వెయ్యి గొంతులు లక్షా డప్పుల కళాకారుల రాష్ట్ర కోఆర్డినేటర్ మాట్లాడుతూ జిల్లా లో ఉన్న డప్పు కళాకారులు, కవులు, రచయితలు, మేదావులు పెద్ద ఎత్తున తరలి వచ్చి బారీ ర్యాలీ డప్పుల తో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అబ్రహం మాదిగ ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు, మాతంగి చిరంజీవి మాదిగ ఎం ఆర్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సాడకుల కృష్ణ మాదిగ ఎం ఎస్ పి సినియర్ నాయకులు,గందగల్ల వీరయ్య మాదిగ ఎం ఎస్ పి జిల్లా గౌరవ అధ్యక్షులు ముత్తరగల్ల రాజు మాదిగ ఎం ఎస్ పి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజానెల్లి సంగమెశ్వర్ మాదిగ, సినియర్ నాయకులు, దేవులపల్లి మహేష్ మాదిగ ఎం ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు, గంగేరి శ్రీనివాస్ మాదిగఎం ఎస్ పి నాయకులు, రవీ మాదిగ ,మెహన్ మాదిగ, పెద్ద పూర్వం కృష్ణ మాదిగ, మెల్లి నవీన్ మాదిగ, డప్పు సత్యం మాదిగ, కోత్తపల్లి అకాశ్ మాదిగ, జాన్ మాదిగ, వినోద్ మాదిగ ,అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలకు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలి

## ప్రమాదవశాత్తు గాయపడిన సీనియర్ జర్నలిస్టు రాజశేఖర్ ను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు సౌడమల్ల యోహన్, ఏబూసి సంపత్




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 23**హుజురాబాద్ నియోజకవర్గం టి డబ్ల్యూ జె ఎఫ్ కమిటీ సమావేశం జమ్మికుంట పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో అధ్యక్షులు యోహాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి సారించి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ పెద్దపెల్లి జిల్లా సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ బందెల రాజశేఖర్ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుండి పడి కాలు కోల్పోయాడని అతనిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని గత ప్రభుత్వం 10 సంవత్సరాలు జర్నలిస్టుల కోసం ఎలాంటి సంక్షేమ పథకాలు గాని జర్నలిస్టు లు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టకుండా జర్నలిస్టులను అనేక ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టు సమస్యల పైన ప్రత్యేక దృష్టి పెట్టి జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భూపతి సంతోష్, జిల్లా సహాయ కార్యదర్శి దొడ్డే రాజేంద్రప్రసాద్, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు, సౌడమల్ల యోహాన్, ఏబూసి సంపత్,వలపి రెడ్డి శ్రీనివాస్,ఎండి కాజా ఖాన్, దయ్యాల సుధాకర్, రచ్చ రవికృష్ణ, ఎండి రఫిక్, కొండ విజయ్, పెద్ది సంతోష్ కుమార్, వంశీకృష్ణ,నాగపురి రాజు, రాజేంద్రప్రసాద్, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.




# నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్



**రాజన్న సిరిసిల్ల, జనవరి -23: (ప్రజాబలం)** నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్ తో 15వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలను సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్ నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్ పై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తామని, ఈ సంవత్సరం నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్ తో వేడుకలు జరుగుతున్నాయని అన్నారు. జిల్లాలోని ప్రతి బూత్ స్థాయి అధికారి పోలింగ్ స్టేషన్ పరిధిలో నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్ల సన్మానం వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి గ్రామం, వార్డులలో ఓటర్ ప్లేడ్జ్ తీసుకోవడం జరుగుతుందని అన్నారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో జనవరి 25న ఉదయం 11 గంటలకు జరిగే జిల్లా స్థాయి జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నేతాజీ భారతదేశ ధైర్య సాహసలకు ప్రతీక... ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరావు....

డుంబ్రిగుడ నేతాజీ భారతదేశ ధైర్య సాహసలకు ప్రతీక అని ప్రధాన ఉపాధ్యాయుడు మల్లికార్జున రావు అన్నారు. మండలంలోని గుంట గన్నెల గ్రామంలో జియుపి పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా తెల్ల దొరలను దేశం నుంచి పారద్రోలి భారతీయుల చిరకాల వాంఛఐన స్వాతంత్రాన్ని అందించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. అహింసవాదం మాత్రమే స్వాతంత్ర్యం సాధనకు సరిపోదని పోరుబాట కూడా ముఖ్యమని నేతాజీ కృషి చేశారని ఆయన చెప్పారు. స్వతంత్ర ఉద్యమంలో అత్యంత కీలక పాత్ర వహించినటువంటి వ్యక్తి, ఒక ఆర్మీ గానీ ఒక నావి గాని ఒక సైన్యాన్ని నిర్మించినటువంటి గొప్ప వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. సింహాచలం, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. మరియమ్మ, కె. శ్రీనివాస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న బండి సదానందం యాదవ్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 23 :**మందమర్రి పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలం కొమురయ్య ఇటీవల మరణించగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి ఆదేశాల మేరకు దశ దిన కర్మకు హాజరైన అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి సదానందం యాదవ్ హాజరై వారి కుటుంబానికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాక వెంకటస్వామి హాయం నుండి వివేక్ వెంకటస్వామి, వినోద్, వంశీకృష్ణ ల కుటుంబానికి విధేయుడుగా ఉంటున్నాని వారి బాటలో జీవితాంతం నడుస్తానన్నారు.

# ఎవరో చేసిన తప్పుకు మమ్మల్ని బాధ్యులు చేయొద్దు

**సమాజంలో అందరూ సమానులే అందులో మేము ఒక భాగమే**

**మా జీవనోపాధి కోసమే భిక్షాటన చేస్తున్నాం**

**ఎటువంటి ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం లేదు**

**పోలీసుల వేధింపులు సరైంది కాదు**

**ఖమ్మం జిల్లా ట్రాన్స్ జెండర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు దోమల మేరీ**




**ఖమ్మం ప్రతినిధి జనవరి 23 (ప్రజాబలం)** ఖమ్మం ఎవరో చేసిన తప్పుకు మమ్మల్ని బాధ్యులు చెయ్యొద్దని, సమాజంలో అందరితోపాటు మేము కూడా ఒక భాగమేనని, ట్రాన్స్ జెండర్స్ అయినంత మాత్రాన చులకనగా అవమానకరం గా బాధించడం సరైనది కాదని, కొందరు పోలీసు అధికారులు తమను నేరస్తులుగా ముద్ర వేసి ప్రతి అంశానికి వేధించడం మానుకోవాలని ఖమ్మం జిల్లా ట్రాన్స్ జెండర్స్ జిల్లా అధ్యక్షురాలు దోమల మేరి ఆవేదన వ్యక్తం చేశారు ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దోమల మేరీ మాట్లాడుతూ. మా జీవనోపాధి కోసం భిక్షాటన చేసుకుంటూ జీవించే వ్యక్తులమే తప్ప దొంగతనాలకు , ఇతర ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి ప్రోత్సహించే వ్యక్తులము కాదని, ఎక్కడ ఏ తప్పు జరిగిన దానికి మమ్మల్ని బాధ్యులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . ఎందుకంటే సమాజంలో మేము తేలికగాచులకనగా కనిపించే వ్యక్తులుగా ఉన్నామని ప్రతి అంశానికి మమ్మల్ని బాధ్యుల్ని చేయటం మంచిది కాదని అన్నారు ఎలాగో కుటుంబాలకు సమాజానికి దూరమై



బ్రతుకుతున్నాం ఇప్పుడే సమాజంలో మేము గుర్తించబడుతున్నాం మా జీవితాలను చీకట్లోకి నెట్టకుండా కాపాడాలని విలేకరుల సమావేశంలో వేడుకున్నారు. ఎక్కడ ఏదైనా సంఘటన జరిగిన దానికి హిజ్రాలను బాధ్యులుగా చూస్తున్నారని, వాయిస్ తేడాగా ఉందని భావించి దానికి ట్రాన్స్ జెండర్స్ పై నేరాన్ని మోపడం ఎంతవరకు సమంజసమని, నేరస్తులను గుర్తించే బాధ్యత పోలీసు యంత్రాంగం పై ఉందని, అనేక కేసులలో మేమే నేరస్తులను గుర్తించి పోలీసులకు అప్పగించిన సంఘటనలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. ఫంక్షన్లో ఉండగా ఓ పోలీస్ అధికారి తన పట్ల ఆ మర్యాదగా ప్రవర్తించారని, ఫంక్షన్ జరుగుతుండగా అందరి సమక్షంలో ఓ పోలీస్ అధికారి ప్రవర్తించిన తీరు సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మేము కూడా ఒక భాగమేనని మమ్మల్ని గుర్తించి గౌరవించాలని ప్రాధేయపడ్డారు ఈ విలేకర్ల సమావేశంలో ట్రాన్స్ జెండర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ సోనీ , ఈసీ నెంబర్స్ ఆర్ మాధురి రూప నాగమణి తదితరులు పాల్గొన్నారు

# మహనీయుల జీవితాలు మనకు వ్యక్తిత్వ వికాస పాఠాలు::జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి – 23 (ప్రజాబలం)** మహనీయుల జీవితాల నుంచి మనం అనేక వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన స్వర్గీయ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్,జిల్లా అధికారులులతో కలిసి పాల్గొన్నారు.నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ఆజాద్ హింద్ ఫౌజ్ ను స్థాపించిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని,ఆయన జయంతి వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.1897 సంవత్సరం జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జన్మించారని,దేశ స్వాతంత్ర్యం కోసం అనేక ఉద్యమాలలో పాల్గొన్నారని, ఆజాద్ హింద్ ఫౌజ్ ను స్థాపించి పోరాడారని, ఆ సంస్థే నేడు ఇండియన్ నేషనల్ ఆర్మీ గా ఉందని అన్నారు. మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించడం ద్వారా వారి జీవితంలోని ముఖ్యంశాల నుంచి మనం వ్యక్తిత్వ వికాస పాఠాలు అనేకం నేర్చుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, కలెక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో మినీ జాబ్ మేళా

**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి – 23 (ప్రజాబలం)** రాజన్న సిరిసిల్ల అద్వర్యంలో సిరిసిల్ల ఎంప్లాయిమెంట్ ఆఫీసు నందు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీ నీల రాఘవేందర్ తెలిపారు.ఎస్ ఎస్ సి /ఇంటర్/ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు నెలకు రూపాయలు 10000 ల నుండి 20,000 ల రూపాయల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.జిల్లా లోని అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాఫీలతో రాజన్న సిరిసిల్ల జిల్లా లోని ఎంప్లాయిమెంట్ ఆఫీసు , సిరిసిల్ల నందు తేదీ. 25.01.2025 రోజున ఉదయం 11.00 గంటలకు జరుగు మినీ జాబ్ మేళాకు హాజరుకావాల్సిందిగా తమ ప్రస్తుత ,పూర్వ విద్యార్థులను,నిరుద్యోగ యువకులను శ్రీ రాఘవేందర్ జిల్లా ఉపాధి అధికారి కోరడమైనది మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్.నెం.9700302582, 9885346768.

# దశదినకర్మ కార్యక్రమాలలో పాల్గొన్న మంత్రి పొంగులేటి పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ డిసిసిబి డైరెక్టర్ మల్లిబాబు యాదవ్





**ఖమ్మం ప్రతినిధి జనవరి 23 (ప్రజాబలం)** అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్,కీ. శే చిత్తారు శ్రీహరి,విశ్వనాధ్ ల తండ్రిగారైన చిత్తారు హుస్సేన్ గారు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి దశదినకర్మ, కార్యక్రమాలలో రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, పాల్గొని కార్యక్రమం ప్రారంభం నుండి చివరి వరకు వచ్చిన అతిథులకు భోజనా కార్యక్రమా లు స్వయంగా పర్యవేక్షి%శీ%చారు ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ మనకు జన్మనిచ్చి ఈ ప్రపంచంలో వేలు చూపి వెన్ను తట్టి జీవిత పాఠాలు నేర్పి ఈ స్థాయికి తీసుకువచ్చిన కన్న తండ్రి ఋణం తీసుకోవాల్సిన బాధ్యత మనిషి గా పుట్టినందుకు ప్రతి ఒక్కరిపై ఉందని, దానిలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మన సాంప్రదాయమని పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మేము న్నామంటూ మనోధైర్యం కల్పించారు ఈ కార్యక్రమంలో చిత్తారు ఇందుమతి రాష్ట్ర నీటిపారుదల శాఖ సంస్థ చైర్మన్ మువ్వ విజయబాబు డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మద్దినేని స్వర్ణకుమారి ఖమ్మం మార్కెట్ చైర్మన్ ఎర్రగర్ల హనుమంతరావు, మలీదు వెంకటేశ్వర్లు మలీదు నాగేశ్వరరావు, షేక్ పతే మహమ్మద్ కూరాకులనాగభూషణం పగడాల నాగరాజు కూరాకుల వల్లరాజు జిల్లా ఓబీసీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, లోడిగ వెంకన్న దుబాకుల శ్రీనివాస్, మేకల నాగేశ్వరరావు బమ్మిడి శ్రీనివాస్, గుమ్మా రోశయ్య బండారి ప్రభాకర్, పొదిలి సతీష్ గంజి సూర్యనారాయణ, కనక బండి విజయలక్ష్మి పల్లెబోయిన శ్రీనివాస్ యాదవ్ హుస్సేన్, పొదిలి తిరుపతిరావు, మొరిమేకల కోటయ్య చేతుల నాగేశ్వరరావు తోడేటి లింగరాజు, కన్నెబోయిన రవి వంశీ సప్పిడి వెంకటేశ్వర్లు వా కదాని శ్రీను చందు మరియు తదితరులు పాల్గొన్నారు

# నిజమైన అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేనా

**కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదాకా ఒక మాట, వచ్చాక మరో మాట అన్నట్టుగా ఉంది**

**ప్రజలను గోల్మాల్ చేయడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు పథకాలు అందించడంలో విఫలమైంది**

**......కాశపాగ ఇమ్మయ్య**

**జిల్లా ఎస్సి ఎస్టి అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మనిటరింగ్ కమిటీ సభ్యులు**

**స్థానిక సంస్థ ల ఎన్నికల కోసమే ఇ ప్రజ పాలన**

**....మాజీ మార్కెట్ కమిటీ చేర్మెన్ పల్లె సంజీవయ్య**



**సంగారెడ్డి జనవరి 23 ప్రజ బలం ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభలలో పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ఊరికి సంబంధించిన పేర్లను గ్రామాల్లో గ్రామసభల్లో వారి పేర్లు రావడం గ్రామాల్లో ఉన్న అసలైన పేదవారికి ప్రభుత్వం సహాయం అందక పోవడం చాలా బాధకరం అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజా పాలన దరఖాస్తులు ఎక్కడ పోయినాయి. కులగణన సర్వే ఎటుపాయే ఇప్పుడు ప్రజాపాలన గ్రామసభ అని డ్రామాలు చేయటం ఏమిటని ఆయన అన్నారు.

ప్రజలను గోల్మాల్ చేయడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు పథకాలు అందించడంలో విఫలమైందని అని ఆయన అన్నారు.

గ్రామ సభలో చదివిన జాబితాలోని ఇందిరమ్మ ఇండ్లు రైతు కూలీలకు ఇచ్చే రైతు భరోసా కొత్త రేషన్ కార్డులు అందరికీ వస్తాయా లేక గ్రామసభలు సంతోషనికె పరిమితం అవుతుయా గ్రామ సభలలో తీసుకుని దరఖాస్తులు చెత్తబుట్టలకెనా వారికి ఇచ్చేది ఉందా?? తేట తెల్లం చేయాలని స్థానిక నాయకులు కాశపాగ ఇమ్మయ్య డిమాండ్ చేశారు

లిమాజీ మార్కెట్ కమిటీ చేర్మెన్ పల్లె సంజీవయ్య మాట్లాడుతు ఉమ్మడి పుల్కల్ మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న గ్రామసభలకు హాజరైన ప్రజలను చూస్తే బాదేసిందని ఆయన అన్నారు ఎన్నో రోజులుగా కొత్త రేషన్ కార్డులు...ఇందిరమ్మ ఇండ్లు...కొత్త పింఛన్ కు రైతుబంధు భూమిలేని పేదలకు ఇస్తామని చెప్పినా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12000 బృతి కోసం దరఖాస్తులు తీసుకొని ఎదురు చూపులు చూస్తున్న ప్రజలకు నిరాశ మిగిలింది మళ్లీ దరఖాస్తులు పెట్టుకోవడానికి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని అయన అన్నారు.

ఎర్రోళ్ల పోచయ్య మాట్లాడుతు భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 15000 ఇస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి గారు దాన్ని ఇప్పుడు 12000 ఇస్తానని చెప్పి కేవలం ఈజిఎస్ లేబర్ కార్డు ఉన్నవారికే పరిమితం చేయడంలో భూమిలేని జాబ్ కార్డు లేని చాలామంది ప్రజలు అయోమయం లో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదాకా ఒక మాట ప్రభుత్వం వచ్చాక మరో మాట అన్నట్టుగా ఉంది అన్నారు.

పేదలకు న్యాయం చేద్దామని ఆలోచన ప్రభుత్వానికి లేదని ఇంటింటికి ఇద్దరు అమ్మాయిలు వచ్చి ఫోటోలు తీసి గ్రామసభల్లో చదివిన జాబితాలో వారి పేరు లేదని తెలిసి ప్రభుత్వ అధికారులపై ఆసాహనం వ్యక్తం చేస్తున్నారని ఇప్పటికైనా అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు కొత్త పైన్షన్ లు భూమి లేని వారికీ భూములు ఇచ్చి నిరుపేదలకు అండగా ఉండాలని ప్రభుత్వం ఆసరా అందించాలని ఆయన అన్నారు ఇ కార్యక్రమం లో కౌన్సిలర్ సంతోష్. డాకూరు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బొమ్మల కొలువు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 23** :మందమర్రి పట్టణంలోని ఇల్లందు క్లబ్ లో గురువారం మందమర్రి ఏరియా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీమతి జి.స్వరూప రాణి దేవేందర్ అధ్యక్షతన బొమ్మల కొలువు కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సింగరేణి సి అండ్ ఎం.డి సతీమణి శ్రీమతి శారద బలరాం, శ్రీమతి సునీత వెంకటేశ్వర్ రెడ్డి ( డైరెక్టర్ పి. పి) లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నృత్యాలు నాటికలు ఆద్యంతం అలరించాయి. అనంతరం లేడీస్ క్లబ్ నిర్వహించినటువంటి ఆటలు మరియు ముగ్గులు పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో పల్లెటూరి వాతావరణం, మంచే, గోశాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో శ్రీమతి మని క్లబ్ సెక్రటరీ, శ్రీమతి కవిత ట్రెజరర్, జాయింట్ సెక్రెటరీ శ్రీమతి సుజాత, శ్రీమతి ఉర్మిల గేమ్స్ సెక్రటరీ, శ్రీమతి సుప్రియ, శ్రీమతి సుల్తానా కమిటీ మెంబర్ లేడీస్ క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

# పద్మారావు గౌడ్ ని పరామర్శించిన శ్రీమతి శ్రీలత శోభన్ రెడ్డి



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** సికింద్రాబాద్ డెహ్రాడూన్ పర్యటనలో గుండెపోటుకు గురై చికిత్స పొందిన అనంతరం నగరానికి చేరుకున్న సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తిగుళ్ల పద్మారావు గౌడ్ ని వారి స్వగృహంలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి శ్రీలత శోభన్ రెడ్డి మరియు టిటియుసి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ మోతే శోభన్ రెడ్డి తో కలిసి పరామర్శించడం జరిగింది, పద్మారావు గౌడ్ ఆకాస్మాత్‌గా అస్వస్థకు గురైన తీరును అడిగి తెలుసుకున్నారు, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించి విశ్రాంతి తీసుకుని త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.

# అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అమలు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 23 :** ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని 17,18 వార్డులలో నిర్వహించిన వార్డు సభలలో మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఇల్లు లేని నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు లేని అర్హత గల నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపచేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన అనంతరం అర్హుల జాబితాలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యత క్రమంలో అత్యంత నిరుపేద అర్హులకు పథకం ఫలాలు అందించడం జరుగుతుందని తెలిపారు.జాబితాలో వివరాలు రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని,రేషన్ కార్డుల జారీలో నిబంధనలు పాటిస్తూ అర్హులైన అభ్యర్థుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.గతంలో మీ-సేవ కేంద్రాలలో చేసుకున్న దరఖాస్తులు,సామాజిక, ఆర్థిక, విద్య,వైద్య,రాజకీయ, కుల గణన కార్యక్రమంలో సేకరించిన సమాచారం, ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు జాబితాలో రానప్పటికీ మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు,ప్రజాపాలన సేవా కేంద్రాలలో, గ్రామసభలలోదరఖాస్తు చేసుకోవచ్చని,అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఆహార భద్రత రేషన్ కార్డు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.రైతు భరోసా పథకంలో వ్యవసాయ యోగ్యం కాని రాళ్లు,గుట్టలు, కాలనీలు,ఇండ్ల వెంచర్లు, లే-అవుట్లు,రైల్వే, నాలా భూములు,వివిధ అభివృద్ధి పథకాల కొరకు ప్రభుత్వం సేకరించిన భూములు జాబితా నుండి తొలగించాలని తెలిపారు.వ్యవసాయ యోగ్యం గల భూమికి రైతు భరోసా ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద నిరుపేద కూలీలు,వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను గుర్తించి, అర్హత మేరకు అర్హులైన లబ్దిదారులకు పథకం వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 24 వ తేదీ వరకు గ్రామపంచాయతీలలో గ్రామసభలు, మున్సిపాలిటీలలో వార్డు సభలు నిర్వహించి అర్హులైన వారి జాబితాను చదివి వినిపించిన అనంతరం జాబితాలో లేని వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, గ్రామ సభ నిర్వహించే ముందు ఆయా ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలము ఆర్టీవో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




**ఖమ్మం ప్రతినిధి జనవరి 23 (ప్రజాబలం)** ఖమ్మం భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాల ను నివారించగలమని ఆర్టీవో వెంకట రమణ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నగరంలోని బ్లుమింగ్ మైండ్ స్కూల్ విద్యార్థుల కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తెలుసు కోవాల్సిన బాధ్యత కలిగి ఉండాలన్నారు దేశంలో ప్రతి ఆర్టీసీ నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రతి మూడు నిమిషాలకు అదే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడుతున్నారని తెలిపారు ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగు తుందని వాపోయారు రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్క వ్యక్తి రూల్స్ ను పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి వాటిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారుట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు, కుటుంబ సభ్యులు తమ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్నారు. కాబట్టి వాహనం నడిపేట ప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని అతివేగం అనర్థదాయకమని మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు.



# జయంతి తప్ప వర్ధంతి లేని మహానుభావుడు సుభాష్ చంద్రబోస్

**ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ నియోజకవర్గం జనవరి 23:**నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నాచారం లో కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ త్యాగానికి, క్రమశిక్షణకు ప్రతిరూపమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తన ఆనందాన్ని, వైభవాన్ని త్యాగం చేసి, స్వాతంత్ర్య సాధనకు అత్యంత కష్టతరమైన మార్గాన్ని అనుసరించాడనీ తెలిపారు. జయంతి తప్ప వర్ధంతి లేని మహానుభావుడు సుభాష్ చంద్రబోస్ అని అన్నారు.
నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్టాట్యూ అసోసియేషన్ నాచారం అద్వర్యంలో జర్గిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిశేకర్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, భాజపా డివిజన్ అధ్యక్షుడు నవీన్, కాంగ్రెస్ నాయకులు, భాజపా నాయకులు, టీఆర్ఎస్ నాయకులు మరియు %ూూూ% యువసేన కిషోర్ రెడ్డి, శ్రీధర్, గురు, మహేశ్ రెడ్డి, సాయి, నరేష్, రమేష్, విజయకుమార్ సింగ్ పాల్గొన్నారు

# వారధి

శబ్ద రత్నాకరం ప్రకారమైతే రెండు తీరాలను కలిపేది అని అర్థం.. అంటే వంతెన అని..
ప్రస్తుతం లోకి వస్తే..
27 జనవరి 2025 నాడు హైద్రాబాద్ లోని రవీంద్ర భారతిలో సాయంత్రం 6.30 గంటలకు జరగబోయే వారధి కార్యక్రమం కూడా.. తెలుగు రాష్ట్రాలకు.. మహారాష్ట్ర తెలుగు వారికి మధ్య వంతెన లాంటిదే అని చెప్పొచ్చు.

రాజకీయపరంగా..

- %ఖీ-ూావీ% నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ గారితో పాటు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారు, లోక్ సభ సభ్యులు కొండా విశ్వేశ్వర రెడ్డి గారు అతిథులుగా వస్తున్నారు..

దానర్థం ఏమిటంటే..

- మహారాష్ట్ర తెలుగు వారి గురించి ఉభయ తెలుగు రాష్ట్రాల రాజకీయ నాయకులకు అవగాహన పెంచడమే అవుతుంది.. అది మహారాష్ట్ర తెలుగువారికి గొప్ప గుర్తింపునిస్తుంది.

సామాజికంగా..

- మార్గదర్శి/ఈనాడు గ్రూప్ నిర్వాహకురాలు శైలజా కిరణ్ గారు.. ప్రముఖ నటుడు సాయి కుమార్ కూడా అతిథులుగా విచ్చేస్తున్నారు.

దానర్థం ఏమిటంటే..

- పత్రికల ద్వారా ప్రపంచవ్యాప్తంగా మహారాష్ట్ర తెలుగువారి గురించి తెలుస్తుంది.. సినీరంగంలో మన చర్చ జరుగుతుంది.

ఇది కూడా మహారాష్ట్ర తెలుగు ప్రజలకు గుర్తింపు తెచ్చినట్టే అని చెప్పుకోవచ్చు..

సాంస్కృతిక కార్యక్రమాలు

- మూడు రాష్ట్రాల తెలుగు కళాకారులు తమ ప్రదర్శన ద్వారా తెలుగు సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటబోతున్నారు.. అది %ఖీ-ూావీ% ఆధ్వర్యంలో జరగడం మహారాష్ట్ర తెలుగు ప్రజలకు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చినట్టే కదా!

వాణిజ్యపరంగా..

- ప్రప్రథమంగా తెలంగాణ - ఆంధ్ర - మహారాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ (%ూావీజజ×%) ఏర్పాటు చేసి ప్రముఖులతో వాణిజ్య మెలుకువలని తెలియచేయబోతున్నారు.. దాంతో మహారాష్ట్రలోని తెలుగు యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతున్నట్టే కదా..!

ఇంతేకాదు..
సాహిత్య, వినోద, విజ్ఞాన కార్యక్రమాలు ఎన్నో ఉంటాయి..
రండి..! మహారాష్ట్ర తెలుగువారి స్వాభిమాన ప్రతీక లాంటి ఈ కార్యక్రమంలో పాల్గొనండి! మహారాష్ట్ర తెలుగు ఐక్యతను చాటండి..!!

# పదవ తరగతి పరీక్షలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి సింగరేణి పాఠశాలల సెక్రటరీ (కొత్తగూడెం) జి. శ్రీనివాస్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 23:** పదవ తరగతి పరీక్షలలో వంద శాతం ఫలితాలు సాధించాలని సింగరేణి పాఠశాల సెక్రటరీ శ్రీనివాస్ అన్నారు. గురువారం మందమర్రి పట్టణంలోని ఎస్సీ హై స్కూల్ ఎయిడెడ్ కళ్యాణిఖనిని సందర్శించారు. పాఠశాలలోని తరగతుల నిర్వహణ మరియు విద్యార్థుల హాజరు భోజన వసతులు మొదలగునవి పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణ సాధించి ఎక్కువ గ్రేడ్ పాయింట్స్ సాధించాలని విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని వివిధ విభాగాలలోని పనితీరును పరిశీలించి వివిధ రంగాలలో బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రశంసించడమే కాకుండా వారికి బహుమతులతో ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్నం భోజనాన్ని పిల్లలకు వడ్డించడమే కాకుండా స్వయంగా రుచి చూశారు. ఇటీవల జరిగిన సీఎం కప్ మరియు సైన్స్ ఒలంపియాడ్ లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. పాఠశాలలో కర్మచారినిగా పనిచేస్తున్న శ్రీమతి కమలని మధ్యాహ్న భోజనం వండుతున్న సిబ్బందిని శాలువాతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏస్. శ్యాంసుందర్, హెడ్మాస్టర్ జె. పురుషోత్తం పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ కు వినతి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 23** :మందమర్రి మున్సిపల్ ఎన్నికల సాధన కమిటీ ఆధ్వర్యంలో మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల సాధన కమిటీ కన్వీనర్ అందుగుల శ్రీనివాస్, నాయకులు డి.వీ దీక్షితులు, మేడిపల్లి సంపత్, రాయబారపు వెంకన్న, మిట్ట లక్ష్మణ్, బండారి సూరిబాబు, కొంగల తిరుపతిరెడ్డి మాయ రమేష్, దాసరి రాజనర్సు, సప్పిడి నరేష్, రామసాని శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com